వార్త

ఆదివారం

18 డిసెంబరు, 2022

# ఔషధాలకూ కల్తీ కాటు..



తారాతీరం

# బాలకృష్ణ జోడీగా ప్రియాంక జవాల్కర్?



బాలకృష్ణ కథానాయకుడిగా అనిల్ రావిపూడి ఒక సినిమా చేయనున్నాడు. కెరియర్ పరంగా బాలయ్యకి ఇది 108వ సినిమా. ఈ సినిమాకి సంబంధించిన ఫైనల్ స్క్రిప్ట్‌కి ఫినిషింగ్ టచ్ ఇచ్చే పనిలో అనిల్ రావిపూడి ఉన్నారు. ఇది తండ్రీ కూతుళ్ల ఎమోషన్స్‌కి సంబంధించిన కథ అనీ, కూతురుగా శ్రీలీల చేయనున్నట్లు సమాచారం.

అనిల్ రావిపూడి సినిమాలు 'రాజా ది గ్రేట్', 'ఎఫ్ 2', 'ఎఫ్3' సినిమాలు చేసిన మెహ్రీన్ బాలకృష్ణ సరసన హీరోయిన్‌గా చేయవచ్చనే టాక్ వినిపించింది. కానీ.. ఇప్పుడు ఈ చిత్రంలో కథానాయికగా ప్రియాంక జవాల్కర్‌ను ఎంపికను చేసినట్టుగా ఒక టాక్ బలంగా వినిపిస్తోంది. 'టాక్సీవాలా', 'ఎస్.ఆర్.కల్యాణ మంటపం' సినిమాలతో విజయాలను అందుకున్న ప్రియాంక చేతిలో ప్రస్తుతం ప్రాజెక్టులేం లేవు. ఆమెను బాలయ్య జోడీగా తీసుకున్నారని సమాచారం. గోపీచంద్ దర్శకత్వంలో బాలయ్య చేస్తున్న 'వీరసింహా రెడ్డి' సంక్రాంతికి విడుదల కానుంది.

# వెంకీ కుడుముల-నితిన్ కాంబినేషన్‌లో మరో సినిమా!



'ఛలో', 'భీష్మ' సినిమాలతో తన ఖాతాలో భారీ విజయాలను నమోదు చేసుకున్నాడు వెంకీ కుడుముల. తాజాగా హీరో నితిన్‌తో వెంకీ కుడుముల మరో సినిమా చేయడానికి ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమాలో నితిన్ విడాకులు తీసుకున్న భర్తగా కనిపించబోతున్నట్లు టాక్. భార్యకు దూరంగా ఒంటరిగా బతికే ఓ మగాడి కథను వెంకీ కుడుముల ఫన్నీ వేలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే స్క్రిప్ట్ రెడీ చేశాడని నితిన్‌కి కూడా పూర్తి కథ బాగా నచ్చినట్లు సమాచారం. ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ భారీ తారాగణంతో భారీ స్థాయిలో నిర్మించబోతుంది. 'భీష్మ' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దాంతో వెంకీ తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లోనూ ఆసక్తి ఏర్పడింది. అన్నిటికి మించి 'భీష్మ' తర్వాత వస్తోన్న సినిమా కనుక వెంకీ కుడుముల-నితిన్‌ల కాంబినేషన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
18 డిసెంబరు, 2022

## మంచి ముత్యాలు

ప్రకృతిని పరిశోధిస్తూ విజ్ఞుడు సంతోషిస్తాడు.
తనకేమీ తెలియదంటూ వెర్రివాడు ఆనందిస్తాడు.

- పోప్


## విషయ విశేషం

విషపు కప్పలు... 4
'సంఘీ'భావం....5
బాల్యాన్ని చిదిమేస్తున్న స్మార్ట్‌ఫోన్లు
పుణ్యప్రదం 'ధనుర్మాస వ్రతం'...6
కవర్ స్టోరీ..8
ఔషధాలకూ
కల్తీ కాటు..
ఈవారం కవిత్వం..12
నన్ను చిగురించనివ్వు
ఖజురహో శిల్పకళలో అదరహో....14
బహుళ ప్రయోజనకారి డిటాక్స్ వాటర్...18
కథ.. 20
ప్రేమ ప్రస్ఫుటం
సాహిత్యం.. 23
తెలుగులో సంకీర్తనా సాహితీ వైభవం
నా కోసమేనా...!..26
తోకలేని పిట్ట... 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..





# తాజా వార్తలు

## ప్రపంచంలోనే అతిచిన్న పట్టణం



క్రొయేషియాలోని ఇస్ట్రియా ప్రాంతంలో ఒక కొండ మీద ఉందిది. గత సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం ఈ పట్టణ జనాభా ఇరవై ఏడు మంది. ఈ పట్టణానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో దీనిని 'షోమ్' అని పిలిచేవారు. దీనికి నిదర్శనంగా 1102 నాటి చారిత్రక పత్రం ఒకటి ఈ మధ్యే బయట పడింది. పట్టణ రక్షణ కోసం 1552లో ఇక్కడ నిర్మించిన గంటస్తంభం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. శతాబ్దాల క్రితం ఇక్కడ సైనికులు, వారి కుటుంబాల వారు ఉండేవారు. ప్రస్తుతం మధ్య యుగాల నాటికి ఇళ్లతో కూడిన మూడు వరుసల ఇళ్లతో రెండు వీధులు ఈ పట్టణంలో ఉన్నాయి. వీటిలోనే ప్రజలు ఉంటున్నారు. జనాభా రీత్యా చూసుకున్నా, పరిమాణం రీత్యా చూసుకున్నా నిజానికి దీనిని గ్రామంగా పరిగణించాలి. అయితే దీనిని ప్రపంచంలోనే అతి చిన్న పట్టణంగా ఎందుకు పరిగణిస్తున్నారో కారణాలేమీ లేవు. అతి చిన్న పట్టణంగా రికార్డులకెక్కడం వల్ల పర్యాటకులు సందర్శిస్తుంటారు.

## పుట్టగొడుగులతో..



పోషకాలకు నిలయమైన పుట్టగొడుగుల్ని ఆహారంగా తీసుకోవడంతో పాటు మందుల తయారీలోనూ ఉపయోగిస్తున్నారు. అయితే కొన్ని రకాల పుట్టగొడుగులతో పర్యావరణ హితమైన ఉత్పత్తుల్నీ తయారు చేయవచ్చంటున్నారు ఆస్ట్రియాలోని జొహాన్స్ కెప్లర్ యూనివర్సిటీకి చెందిన నిపుణులు. రెయిషి అనే పుట్టగొడుగుల పైపొర ఎంతో గట్టిగా ఉండి లోపలున్న మెత్తని భాగాల్ని కాపాడుతుంది. ఈ పొరని తీసి ఎండబెడితే అది ఎక్కువ వేడిని తట్టుకుందట. ఆ తరువాత దీనిని నేల మీద వేస్తే భూమిలో కలిసిపోయింది. ఈ లక్షణాన్ని దృష్టిలో పెట్టుకుని మైసిలియోట్రానిక్ అనే పదార్థాన్ని రూపొందించి ఎలక్ట్రానిక్ పరికరాల్లో వాడొచ్చు అంటున్నారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్‌లో వాడే సర్క్యూట్ బోర్డులను పాలిమర్లతో తయారు చేయడం వల్ల అవి ఇతర పదార్థాలతో కలిసి ఉండటంతో రీసైకిల్ చేయడం కష్టంగా ఉంది. అదే వాటిని పుట్టగొడుగుల నుంచి తీసిన పదార్థంలో చేస్తే అది త్వరగా నేలలో కలిసిపోతే మిగిలిన మెటల్‌ను సులభంగా రీసైకిల్ చేయవచ్చు అంటున్నారు.

**పాములు,** పులుల వల్లే మనుషులు చనిపోతారని అనుకుంటాం. కప్పలు కూడా అంత ప్రమాదకరమైనవే. కప్పల్లో కూడా విషపూరితమైన కప్పలు ఉంటాయి. అయితే చూసేందుకు ఇవి అందంగా ఉంటాయి, కానీ ఒళ్లంతా విషమే. ఈ కప్పలను 'గోల్డెన్ పాయిజన్ కప్పలు'

# విషపు కప్పలు



అంటారు. అవి సాధారణంగా రెండు అంగుళాలు లేదా కొంచెం పెద్దగా ఉంటాయి. కానీ ఈ కప్పలు పది మందిని చంపేంత విషం ఇందులో ఉండటం గమనార్హం. శతాబ్దాలుగా కొలంబియాలోని వేటగాళ్లు తమ ఎరను పట్టుకోవడానికి ఈ రకమైన కప్పల విషాన్ని ఉపయోగిస్తారట.



### నేషనల్ జియోగ్రాఫిక్ నివేదికల ప్రకారం..

ఈ కప్పలు ఎందుకు విషపూరితమైనవి అనేదానిపై కచ్చితమైన సమాచారం లేదు. అయినప్పటికీ వాటి విషం ప్రధానంగా మొక్కలు, విషపూరిత కీటకాల నుంచి వస్తుందని నమ్ముతారు. అయితే ఇతర ప్రదేశాలలో ఉన్న కప్పలకు ఎలాంటి విషం లేకపోయినా ఈ కప్పల్లో విషం ఉండటం భయాందోళన కలిగించే అంశం.



ఈ కప్పలను తాకడం కూడా మరణానికి దారి తీస్తుందట.



వైద్య పరిశోధనలో పాల్గొన్న వ్యక్తులు ఈ రకమైన కప్పలను వైద్య రంగంలో ఉపయోగించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ కప్పలు ఔషధాలను తయారు చేయడానికి ఉపయోగించవచ్చని వైద్యులు భావిస్తున్నారు. దీని ద్వారా శక్తివంతమైన పెయిన్ కిల్లర్స్ టాబ్లెట్‌లను తయారు చేసేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు.



ఈ మచ్చల కప్పలో వంద కంటే ఎక్కువ జాతులు వున్నాయి. వాటి సగటు పొడవు ఒక అంగుళం కంటే ఎక్కువ ఉంటుంది. చాలా కప్పజాతులు కొలంబియాలోని పసిఫిక్ తీరంలో రెయిన్ ఫారెస్ట్‌లోని చిన్న పాచ్‌లో నివసిస్తున్నాయి.

ఏదైనా ప్రమాదం గుర్తించినప్పుడు చర్మం నుంచి విషం విడుదల అవుతుంది. ఆ విషం నేరుగా మానవ చర్మంపై పడినప్పుడు మనిషి చనిపోయే ప్రమాదం ఉంది. ఈ కప్పల విషం మనుషులపై పడినప్పుడు పల్స్ రేటు పడిపోయి, చనిపోయే ప్రమాదం ఉంది.

ఈ కప్పలు తక్కువ ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో జీవించగలవు. ఈ కప్పరంగు పసుపు, నారింజ, లేత ఆకుపచ్చ రంగులో ఉంటుంది. వివిధ ప్రదేశాలను బట్టి వాటి రంగులు కూడా భిన్నంగా ఉంటాయి. ఈ కప్పలు వేటాడే వారిపై విష ప్రయోగం చేస్తాయ ని పరిశోధకులు అంటు న్నారు. ఇవి ప్రధానంగా ఈగలు, చీమలు, చెదపురుగులను తింటాయి. బంగారు పాయిజన్ కప్పల శరీరాల కూడా విషపూరిత మైనవేనట.





# 'సంఘీ' భావం



## బాల్యాన్ని చిదిమేస్తున్న స్మార్ట్‌ఫోన్లు

**స్మార్ట్**‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తరువాత ఎక్కువ మంది చెడు ప్రభావానికి, నేర ప్రవృత్తికి లోనౌతున్నారు. ముఖ్యంగా యువత, మైనర్లు స్మార్ట్‌ఫోన్ బారిన పడి భవిష్యత్తును అంధకారంగా మార్చుకుంటున్నారు. తెలిసీ తెలియని వయస్సులో స్మార్ట్ ఫోన్‌లో అభ్యంతరకరమైన వీడియోలు, విచ్చలవిడి నేర ప్రవృత్తితో కూడిన లఘు చిత్రాలు, వీడియో గేమ్స్ వంటివి వీక్షించడం వల్ల విచక్షణను కోల్పోతున్నారు. తాము చూసిన వీడియోలను ఫాంటసీగా భావించి తాము కూడా అదేవిధంగా చేయాలన్న తపనతో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడి కటకటాల పాలౌతున్నారు. మరికొందరు తీవ్రవత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుని జీవితాన్ని అర్థాంతరంగా ముగించుకుంటున్నారు. కన్న తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. నేరాలకు పాల్పడటం ద్వారా అమాయకుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాల్లో మైనర్ల భాగస్వామ్యం ఉన్న ఘటనలు క్రమంగా పెరుగుతున్నాయి. న్యూఢిల్లీలో సంచలనం రేపిన నిర్భయ ఘటనలో ఒక మైనర్ సైతం మృగంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. ఇలాంటి పలు ఘటనలు గత ఐదారేళ్లుగా ఎన్నో జరిగాయి. ఇటీవల హైదరాబాద్‌లో ఒక మైనర్ బాలికపై నలుగురు మైనర్ బాలురు సాముహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనను వీడియో తీసి బెదిరించి ఆమెపై వరుసగా అత్యాచారాలు కొనసాగించారు. ఈ సమయంలో తాము చూసిన నీలిచిత్రాలను ఆమెకు చూపించి ఆ విధంగా తమతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో ఒక పాఠశాలలో విద్యార్థులు అసభ్య కదలికలతో నృత్యం చేసి దానిని వీడియో చిత్రీకరణ చేశారు. ఈ విషయం బయటకు రావడంతో పది మంది విద్యార్థులను సస్పెండ్ చేసి టీసీలు ఇచ్చి పంపించారు. ప్రస్తుతం మైనర్లు పాల్గొంటున్న నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోందని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2019లో బాలలపై సుమారు 33 వేల కేసులు నమోదు అయ్యాయి. 2020లో 29,768 కేసులు, 2021లో 31,170 కేసులు నమోదు అయ్యాయి. 2022లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో 4 శాతం వరకు మైనర్లు పాల్గొన్న కేసులు ఉంటున్నాయంటే పరిస్థితి ఎంత తీక్షణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చినతరువాత మైనర్లు విచక్షణ కోల్పోయి వ్యవహరిస్తున్నారు. ముందుగా తల్లిదండ్రులతో ఘర్షణకు దిగుతుంటారు. ఫోన్‌ను గంటల తరబడి చూస్తూ కాలం గడుపుతుంటారు. తల్లిదండ్రులు వారించే ప్రయత్నం చేస్తే దాడి చేయడమో, ఇంటి నుంచి పారిపోవడమో, ఆత్మహత్య చేసుకోవడమో వంటి విధానాలను అనుసరిస్తారు. అందుకే తల్లిదండ్రులు ముందు నుంచో సెల్‌ఫోన్ వాడకంపై కొన్ని నిబంధనలు అమలు చేయాలి. దానిని అనుసరిస్తేనే ఫోన్ చూసేందుకు అనుమతి ఇవ్వాలి. ఫోన్‌లో మైనర్లు బాలురు దేనిని వీక్షిస్తున్నారు, ఎవరితో చాటింగ్ చేస్తున్నారు అనే విషయాలపై దృష్టి పెట్టాలి. అప్పుడప్పుడు ఫోన్ తీసుకుని సెర్చింగ్ హిస్టరీ పరిశీలించాలి. ఫోన్ లాక్‌ను తల్లిదండ్రులకు తెలిసే విధంగా చూసుకోవాలి. నీలి చిత్రాలు చూసే అలవాటుతో కొందరు చెడిపోతే కొన్ని రకాల గేమ్స్ ఆడటం వల్ల మరికొందరిలో నేర ప్రవృత్తి పెరుగుతూ ఉంటుంది. గతంలో కార్టూన్ సినిమాల్లో టామ్ అండ్ జెర్రీ చూసిన కొందరు పిల్లల్లో ఇతరులను టీజ్ (వేధింపులు) చేయడానికి ప్రయత్నించేవారు. దీనితో కొందరు తల్లిదండ్రులు ఈ కార్టూన్ చూడటానికి పిల్లలకు అనుమతి ఇచ్చే వారు కాదు. ప్రస్తుతం అంతకు మించిన వీడియోలు స్మార్ట్‌ఫోన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. బయట ప్రపంచాన్ని పట్టించుకోకుండా గేమ్స్ అడేవారు కొందరైతే. ఎదుటి వారిపై దాడులు చేయడం వంటి విధానాలకు పాల్పడుతూ ఉంటారు. ముఖ్యంగా బ్లూ వేల్ ఛాలెంజింగ్ గేమ్ అనేక మంది ప్రాణాలను తీసుకుంది. ఈ గేమ్ ముందు చాలా ఆసక్తికరంగా ప్రారంభం అవుతుంది, 50 రోజుల పాటు ఈ గేమ్‌ను ఆడాల్సి ఉంటుంది. ముందుగా చిన్న చిన్న ఛాలెంజెస్ ఉంటాయి, ఆడేకొద్దీ పిల్లల్లో ఆసక్తి పెంచే విధంగా ఉంటాయి. 20 రోజులు దాటిన తరువాత క్రమంగా ఛాలెంజెస్ హింసను ప్రేరేపించే విధంగా మారతాయి. బ్లేడ్‌తో గాయాలు చేసుకోవాలని, సూదులతో గుచ్చుకోవాలని ఛాలెంజెస్ వస్తుంటాయి. ముందు నుంచి తాము విజయం సాధిస్తూ వచ్చినందున ఇవి కూడా చేస్తే గేమ్‌లో విజేతగా నిలబడతామన్న లక్ష్యంతో చిన్నారులు దీనిని అనుసరిస్తారు, చివరకు ఆత్మహత్య చేసుకోవాలని గేమ్ వత్తిడి చేస్తుంది. మూడు అంతస్తుల భవనంపై నుంచి దూకాలని, నదిలో దూకాలని, విషతుల్యమైన ఆహారాన్ని భుజించాలని ఛాలెంజెస్ వస్తాయి. గేమ్‌లకు అలవాటు పడి అందులో వచ్చే ఛాలెంజెస్ చేస్తూ వెళ్లిన పిల్లలు ప్రమాదాన్ని గుర్తించలేకపోతారు. ఈ సమయంలో వారు ఆత్మహత్య చేసుకుంటారు. 2018, 2019 సంవత్సరాల్లో బ్లూవేల్ ఛాలెంజ్ గేమ్ ప్రపంచాన్నే ఛాలెంజ్‌గా మార్చేసింది. ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. మనదేశంలో కూడా సుమారు 20 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రభుత్వం ఇలాంటి వీడియో గేమ్‌ల విషయంలో చర్యలు తీసుకున్నా మళ్లీ ఏదో రూపంలో ఇలాంటి గేమ్స్ ప్రత్యక్షం అవుతూనే ఉంటాయి. పిల్లలు ఫోన్లకు బానిసలుగా మారకముందే తల్లిదండ్రులు గమనించి వారిని హెచ్చరించకపోతే ఇలాంటి ఘటనలు పెరుగుతూనే ఉంటాయి. పిల్లలు తప్పుదారి పట్టిన తరువాత బాధపడటం కంటే ముందునుంచే జాగ్రత్తలు వహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# పుణ్యప్రదం 'ధనుర్మాస వ్రతం'

పి.యస్.యమ్.లక్ష్మి

**మా**సాలన్నింటిలోకీ ఉత్తమమైన మార్గశిర మాసం తనేనంటాడు శ్రీకృష్ణుడు. స్థితి కారకుడయిన ఆ శ్రీ మహావిష్ణువుని సకల లోకాలూ ఆరాధించి తరిస్తాయి కదా. మరి ఆ మహావిష్ణువుతో సరితూగే మార్గశిర మాసంలో వచ్చే అత్యంత పుణ్యప్రదమైన ధనుర్మాసం గురించి తెలుసుకుందాం.

కాలమానం ప్రకారం ఒక సంవత్సరాన్ని రెండు ఆయనాలుగా విభజించారు. మొదటిది ఉత్తరాయనం, రెండోది దక్షిణాయనం. ఉత్తరాయనం అంటే దేవతలకు పగలు; దక్షిణాయనం అంటే దేవతలకు రాత్రి. సూర్యుడు కర్కాటక రాశిలోకి ప్రవేశించినప్పుడు మొదలయిన దక్షిణాయనం, మకర సంక్రాంతి రోజున సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించటంతో ముగిసి ఉత్తరాయనం ప్రారంభం అవుతుంది. మార్గశిర పౌర్ణమి తర్వాత ధనుర్లగ్నంలో సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశిస్తాడు. అప్పటినుంచీ ధనుర్మాసం ప్రారంభమై సూర్యుడు ఆ రాశిలో వున్న నెల రోజులూ వుంటుంది. అంటే దేవతలకి దక్షిణాయనం (రాత్రి) పూర్తయ్యి ఉత్తరాయనం (పగలు) ప్రవేశించే సమయం ఇది. ఈ ధనుర్మాసం మన రోజుకి తెల్లవారుజాములాంటిది. ఆ సమయం సాత్వికమైన ఆరాధనలకు ప్రధానమైనది. కనుక సత్వగుణ ప్రధానమైన విష్ణువును ఈ నెలలో ఆరాధిస్తారు. ఈ నెల విష్ణుమూర్తికి ప్రీతికరమైనది అనుకున్నాం కదా. అంతేకాదు, విష్ణు ఆరాధనకి సంబంధించి ఎన్నో విశేషాలతో కూడుకున్నది కూడా.

సూర్యుడు ధనూ రాశిలో ప్రవేశించడాన్ని 'పండుగ నెలపట్టడం' అని కూడా అంటారు. అంటే ఈ నెల రోజులూ రకరకాలుగా ఈ మాస విశిష్టతని తెలియజేసే కార్యక్రమాలు జరుపుకుంటారు. ఉత్తరాయన పుణ్యకాలంలో స్వర్గద్వారాలు తెరుచుకుంటాయని అంటారు. కురు పితామహుడు భీష్ముడు రణ రంగంలో అంపశయ్య మీద ఈ పుణ్యకాలం వచ్చేవరకు వేచివుండి ప్రాణాలు వదిలిన విషయం తెలిసిందే. దానికి గుర్తుగా ఈ నెల రోజులూ స్త్రీలు తమ ఇళ్ల ముందు ప్రతిరోజూ అందమైన సంక్రాంతిముగ్గులు వేసి వాటికి అన్ని వైపులా ద్వారాలు తెరిచి వుంచుతారు. రోజూ వేసే ముగ్గుల్లా బార్డర్లతో మూసివెయ్యకుండా తెల్లవారేసరికల్లా వాకిట్లో ముగ్గుండాలి. ప్రత్యేకమైన ముగ్గులు వెయ్యాలంటే చాలా సమయం పడుతుంది కదా. అందుకే స్త్రీలు తెల్లవారురుఝామునే లేచి వాకిలి శుభ్రం చేసి, కళ్లాపు జల్లి, అందమైన ముగ్గులు పెడతారు. ఆ ముగ్గుల్లో ఎన్నో రకాలు. తాబేలు, సర్పం, శివుడి మూడు కళ్లు వగైరా.. ఇలా ఎన్నో.. ఎన్నెన్నో! చివరి రోజు రథంముగ్గు వేస్తారు. ఇన్నాళ్లూ తాము ఆరాధించిన దేవతా మూర్తులను ఊరేగిస్తున్న సూచనగా ఈ రథంతాళ్లని కొంత దూరం చిత్రిస్తారు. ఈ ముగ్గుల మీద ఇదివరకు చాలా రకాల కార్టూన్లు వచ్చాయి. అసలు ఈ కాలంలో చలి బాగా ఉంటుంది. దానిని తట్టుకోవటానికి స్త్రీలకి చక్కని వ్యాయామమిది.

ఆడపిల్లలు ముగ్గులు వెయ్యటమే కాదు, ఆవుపేడని సేకరించి, గొబ్బెమ్మలు చేసి బియ్యంపిండి, పసుపు, కుంకుమలతో అలంకరించి, వాటిని గోపికలుగా భావించి పూజిస్తారు. ఈ నెల రోజులూ గొబ్బెమ్మలను ముగ్గుల మధ్యలో అందంగా అలంకరిస్తారు. ధనుర్మాసం నెల రోజుల్లో ఒకరోజు 'సందెగొబ్బెమ్మ' అని ప్రత్యేకించి పెడతారు. ఆ రోజు సాయంకాలం రెండు పెద్ద గొబ్బెమ్మలు, ఒక చిన్న గొబ్బెమ్మ చేస్తారు. తల్లిగొబ్బెమ్మ, పిల్లగొబ్బెమ్మ అని. వాటిని అందంగా అలంకరించిన పీట మీద పెట్టి, పూజించి, కన్నె పిల్లలందరినీ పిలిచి వాటి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ కృష్ణుడికీ, గొబ్బెమ్మలకీ సంబంధించిన పాటలు పాడతారు. దీనిని సందె గొబ్బెమ్మ అంటారు. ఇలా చేస్తే ఆడపిల్లలకి మంచి భర్త వస్తాడని విశ్వసిస్తారు. పాటల రూపంగా తమ కోరికలను తెలుపుకునేవారు.



సుబ్బీ గొబ్బెమ్మా, శుభమూ నీయవే,
తామర పువ్వంటి తమ్ముణ్ణియ్యవే,

చేమంతి పువ్వంటి చెల్లెల్నియ్యవే,
మొగలి పువ్వంటి మొగుణ్ణియ్యవే

ఈ పాట పాడటానికి ఆడపిల్లలు సిగ్గుల మొగ్గయ్యేవాళ్లు. అనేక విధాల నచ్చచెప్పిన తర్వాత ముసి ముసి నవ్వులతో, నును సిగ్గులతో వారు ఆపడే విధానం చూసి తీరాలి. ఇవన్నీ మనకి కనుమరుగవుతున్న అందాలు.

ఇప్పుడంటే హైటెక్ చదువులు పెరిగాయిగానీ, ఇదివరకు మన ప్రాంతం వ్యవసాయాధారిత ప్రాంతం. పండిన పంటలు ఇంటికి చేరే సమయం ఇది. ఇన్నాళ్లూ పడ్డ కష్టం ఫలించే సమయం. రైతులందరూ సంతోషంగా సంబరాలు చేసుకునే సమయం. పంటలు సమృద్ధిగా చేతికొస్తాయి గనుక దానధర్మాలు చేసే సమయం. అందుకే హరిదాసులు ఈ కాలంలోనే ప్రత్యేకమైన వస్త్రధారణతో, నెత్తి మీద గుమ్మడికాయ లాంటి రాగిపాత్రతో చిడతలు వాయిస్తూ, హరి నామ సంకీర్తన చేస్తూ, 'హరిలో రంగ హరి..' అంటూ ఇంటింటికీ వస్తారు.

హరిదాసులను సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువుగా, ఆ పాత్రని భూమిగా పరిగణించి, కన్నెపిల్లలు వారి పాత్రలో బియ్యం పోసి, వారి ఆశీర్వచనం తీసుకుంటారు. అలాగే గంగిరెద్దులవాళ్లు, అనేక రకాల వేషగాళ్లు వస్తారు.

పల్లెల్లో ఇది పెద్ద పండుగ. అందుకే కొత్తగా పెళ్లయిన కూతుళ్లనీ, అల్లుళ్లనీ ఇంటికి పిలిచి కానుకలిస్తారు. కొత్త ధాన్యం ఇంటికొస్తుంది గనుక దానితో పరవాణ్ణాలు, అరిసెలు మొదలయిన పిండివంటలు తయారు చేస్తారు. పండక్కి అత్తారింటికొచ్చిన కొత్త అల్లుళ్ల గురించీ, వారికి కనబడకుండా దాక్కుని సిగ్గుతో మురిపించే భార్యామణుల గురించీ మా చిన్నప్పుడు చక్కని కవితలతో అందమైన శుభాకాంక్షల కార్డులు కూడా వుండేవి. అంతేకాదు, ఇంత కాలం పొలం పనులతో శ్రమపడ్డ వ్యవసాయదారులకి ఆటవిడుపు. అందుకనే కోడిపందాలు, ఎడ్లపందాలు, గాలిపటాలు వగైరా సంబరాలు. ఇవి ఇళ్లల్లో సంబరాలయితే, ఆలయాలలో సంబరాలు చెప్పతరమా! శ్రీ మహావిష్ణువుకి ప్రీతికరమైన రోజులు గనుక ఈ ధనుర్మాసమంతా అన్ని వైష్ణవాలయాలూ కళకళలాడుతాయి. అందులోనూ ఆయన అలంకరాప్రియుడు, భోగప్రియుడు. తెల్లవారుఝామునే అన్ని దేవాలయాలలో పూజలు జరుగుతాయి. ఈ చలికాలాన్ని తట్టుకుని శక్తినిచ్చే చక్రపొంగలి, కట్టుపొంగలి, పులిహోర, దద్ధ్యోజనం వగైరా పదార్థాలను దేవుడికి నివేదించి అందరికీ పంచుతారు. మార్గశిర మాసం నుండి పుష్యమాసం వరకు చలి చాలా ఉధృతంగా ఉంటుంది. అందువల్ల ఆ సమయంలో శరీరానికి పుష్టినిచ్చే ఆహారం బీదసాదలకి అందజేయడానికి మన రుషులు మునులు చేసిన ఏర్పాటిది.

మార్గశిర మాసం ఇంకా అనేక పర్వదినాల సమాహారం. సుబ్రహ్మణ్యుడు, కాలభైరవుడు, దత్తాత్రేయుడేగాక భగవద్గీత అవతరించిన మాసం కూడా ఇదే. అంతేకాదు, భూదేవి అవతారమైన గోదాదేవి 'మార్గళి' వ్రతమాచరించి తన పాశురాలతో శ్రీరంగనాథుని మెప్పించిన మాసమిది. అందుకే వైష్ణవాలయాలలో ఈ నెల రోజులూ ఈ పాశురాలని చదువుతారు. తిరుమల శ్రీవారి ఆలయంలోనూ సుప్రభాతానికి బదులుగా 'తిరుప్పావై' పఠిస్తారు. సహస్ర నామార్చనలో తులసికి బదులు బిల్వపత్రాలతో పూజిస్తారు. భోగి రోజు ఆండాళ్ కళ్యాణం వైభవంగా జరుపుతారు.



ఈ నెలలో శ్రీకృష్ణుడికి తులసిమాలలు సమర్పించిన కన్యలకి మంచి భర్త లభిస్తాడని నమ్మకం. లక్ష్మీనారాయణుడిని తులసీదళాలతో పూజించడం పుణ్యప్రదమని అంటారు.

ధనుర్మాసమంతా విష్ణుపత్నియైన శ్రీ మహాలక్ష్మిని ద్విసంధ్యలలో ఆరాధించే వారికి సకల శుభాలూ చేకూరుతాయని నమ్మకం. ఈ మాసంలో వచ్చే గురువారాల్లో మహాలక్ష్మిని పూజిస్తే ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వృద్ధి చెందుతాయంటారు. వైకుంఠ ఏకాదశినాడు విష్ణుమూర్తి ఉత్తర ద్వార దర్శనం చేస్తే ముక్తి అంటారు. భక్త వత్సలుడైన ఆ శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన ధనుర్మాసం కనుక ఈ మాసంలో ఆ స్వామిని ఉద్దేశించి చేసే ఏ చిన్నపాటి పూజైనా అమోఘ ఫలితాలన్నిస్తుంది.

వైష్ణవులు ధనుర్మాస వ్రతం చేస్తారు. ఈ వ్రతం గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి చెప్పినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ధనుర్మాస వ్రతం గురించి బ్రహ్మాండ, ఆదిత్య పురాణాల్లో, భాగవతంలో, నారాయణ సంహితలో కనిపిస్తాయి.



జ్యోతిష్యశాస్త్రం ప్రకారం ఈ కాలంలో సూర్యుని ప్రయాణం మందకొడిగా వుంటుంది. గురుడి ప్రభావం కూడా తక్కువగా ఉంటుంది. ధనుర్మాసాన్ని శూన్యమాసం అంటారు. ఈ నెలలో నిశ్చితార్థం, వివాహం, ఇల్లు కొనటం, నిర్మించటం, కొత్త ఇంట్లోకి ప్రవేశించటం లాంటి శుభకార్యాలు చేయకూడదు. ధనుస్సంక్రమణం సమయంలో నదీస్నానాలు చేయడం పుణ్యప్రద మైందని పెద్దల ఉవాచ. ❑



# ఔషధాలకూ కల్తీ కాటు..

కవర్ స్టోరీ

సుంకవల్లి సత్తిరాజు

> అందమైన అవనిలో ప్రకృతి సృష్టించిన అందాలెన్నో కనువిందు చేస్తాయి. ప్రకృతి సౌందర్యం మధ్య మానవుడు బుద్ధిజీవిగా, అనేక విశిష్టతలతో మనుగడ సాగిస్తున్నాడు. ఇతర జీవజాలానికి, మానవ జాతికి మధ్య అడుగడుగునా ఎంతో వ్యత్యాసం అగుపించడం గమనార్హం.


**మంచి-చెడుల** మధ్య గల తేడాను గుర్తించి, సాటి మానవుల పట్ల సానుభూతిని, సుహృద్భావాన్ని, మానవత్వాన్ని ప్రదర్శిస్తూ మానవజాతి ఈ సృష్టిలో అత్యంత విలక్షణ మైన జీవజాతిగా, నాగరికతకు ప్రతిరూపంగా, తన మేధస్సుతో ప్రపంచాన్ని సునాయాసంగా శాసించగల స్థాయికి చేరుకోవడం ఒక అద్భుతమైన వరం. అయితే కాలక్రమంలో మానవుడు స్వార్థజీవిగా మారిపోయాడు. స్వార్థమే పరమావధిగా భావించి, మానవత్వం మరచి, విలువలను గాలికి వదిలేసి ధనమే ఇంధనంగా భావించి బతకడం ఆరంభించాడు. ఇది మానవ జీవన విధానంలో చోటు చేసుకున్న చేటుకాలం. ఎక్కడైతే న్యాయంగా జీవించాలన్న జ్ఞానం మాయమౌతుందో, విలువలతో హుందాగా మెలగాలన్న విచక్షణ కొరవడుతుందో, అక్కడ నైతికతకు చోటుండదు. సక్రమ ఆలోచనలకు తావుండదు. ఇలాంటి అస్తవ్యస్తమైన అనారోగ్యకరమైన వాతావరణంలో జీవించడానికే మానవుడు మక్కువ చూపించడం ఈ ఆధునిక యుగంలో మానవ ఆలోచనలకు పట్టిన గ్రహణం. స్వార్థం మరిగి, అవినీతి పెరిగి, సంకుచిత మనస్తత్వంలో, మానవ లక్షణాలకు విరుద్ధంగా తన నైజాన్ని వికృతంగా మలచుకున్న ఫలితమే నేటి సమాజంలో చోటు చేసుకుంటున్న సకల దుష్పరిణామా లకు మూలకారణం. తరతరాలకు తరగని సంపద సృష్టించుకోవాలనే ఏకైక ధ్యేయంతో ఏటికి ఎదురీదుతున్న మానవుడు చివరికి ఆ ప్రవాహంలోనే మునిగిపోవడం తథ్యం. ఒక జీవరాశిని మరొక జీవరాశి చంపుకుతినే పద్ధతి మానవేతర జీవజాలంలో ఉంది. స్వజాతిని స్వజాతి చంపుకుతినే విధానం కూడా కొన్ని జీవరాశుల్లో కనిపిస్తుంది. అయితే ఎంతో బుద్ధిజీవిగా పేరుగాంచిన మానవజాతి స్వజాతి చేతిలో అంతం కావడం విలువలు లేని సమాజంలో చోటు చేసుకుంటున్న ఒక వికృత పరిణామం. స్వార్థం పరాకాష్ఠకు చేరి, సంపాదనే జీవిత పరమార్థంగా మారిన నేపథ్యంలో ఇతరుల శ్రమను దోచుకోవడం, అవినీతి ద్వారా ఆకాశహర్మ్యాల్లో విహరించడం, డబ్బుకోసం అడ్డమైన దారులు అన్వేషించే క్రమంలో కల్తీని నమ్ముకోవడం, కల్తీని అమ్ముకుని సొమ్ము సోచుకోవడం చివరికి ఆరో గ్యం కోసం ఉపయోగించే ఔషధాల్లో నకిలీని ప్రవేశపెట్టి, ప్రాణాలతో చెలగాటమాడడం మానవ మేధస్సుకు సోకిన భయంకరమైన వ్యాధి.

ఒకప్పుడు వైద్యులను భగవంతుడితో పోల్చేవారు. "వైద్యో నారాయణో హరిః" అనే నానుడి అందుకే వచ్చింది. వైద్యులు కూడా రోగులను అత్యంత శ్రద్ధతో చూస్తూ, తగిన చికిత్స అందించేవారు డబ్బు కంటే రోగి ప్రాణం ముఖ్యమనే విలువలు కలిగిన నాటి సమాజం గతించింది. రోగుల ప్రాణాల కంటే డబ్బుకే ప్రాధా న్యతనిచ్చే నూతన శకం ఆవిర్భవిం చింది. రోగి చనిపోయినా, చికిత్స చేస్తున్నట్టు నటించి, వివిధ పరీక్షల పేరుతో లక్షలు గుంజడం, మృత జీవికి ఆక్సిజన్ ఎక్కించినట్లు అభినయించ చడం, బిల్లులు వసూలు చేయడం వంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నట్టుగా అనునిత్యం ఎన్నో వార్తా కథనాలు వెలుగు చూస్తున్నాయి.

వైద్యవృత్తి పట్ల ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిన మాట వాస్తవం. కొవిడ్ సమయంలో జరిగిన అనేక సంఘటనలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. పెద్ద పెద్ద ఆసుపత్రుల్లో కరోనా రోగులను కరుణించలేదు. కాసులున్న కుబేరులకే అగ్రతాంబూల మివ్వడం, వైద్యుల నిర్లక్ష్యంతో చాలామంది శ్వాస అందక చనిపోవడం జరిగింది. కొంతమంది చీకటి శక్తుల

దుష్ప్రచారం వలన లేనిపోని వదంతులతో ఎంతో మంది ప్రజలు భయంతో తమ ప్రాణాలను వదిలేసిన ఉదంతాలెన్నో ఉన్నాయి. కేవలం వందల్లో తగ్గిపోయే కరోనాకు లక్షలు గుంజి కుబేరులుగా మారిన మానవత్వం నశించిన వైద్యుల గురించి ఎన్నో వార్తాపత్రికలు పుంఖానుపుంఖాలుగా వార్తలు ప్రచురించాయి. కరోనా కాలంలో ఎంతో మంది ప్రజలు ఆర్థికంగా నష్టపోయారు.ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడింది. అయితే కరోనా సంక్షోభంలో ఇబ్బడి ముబ్బడిగా డబ్బు సంపాదించిన వైద్యరంగం గురించి వర్ణింపనలవి కాదు. అయితే అందర్నీ ఒకే గాటిన కట్టడం కూడా తప్పే. మానవత్వం ప్రదర్శించి ప్రాణాలకు తెగించి రోగుల ప్రాణాలను కాపాడాన వైద్యుల, నర్సుల సేవలు విస్మరించలేం.

ప్రాణాలను కాపాడేవారిని పరమాత్ముడంటారు. ప్రాణాలు తీసేవారిని హంతకులంటారు. అయితే ఆయుధాలతో సంబంధం లేకుండా చుక్క రక్తం నేల చిమ్మకుండా మానవ ప్రాణాలను హరించే కాలయములు తయారైనారు. కల్తీ ఆహారంలో, కల్తీ మందులతో నూరేండ్ల ఆయుష్షును క్షణాల్లో నిలువునా తీసేసి కాటికి పంపే 'మెడికల్ మాఫియా' ఒక మహా వృక్షంగా మారిపోయింది. నకిలీ రసాయనాలు వినియోగించి, శాస్త్రబద్ధత లేని అనైతిక వైద్య సూత్రాలతో ప్రజల ప్రాణాలను పంచభూతాల్లో కలిపేస్తున్న మెడికల్ మాఫియా సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో సహా పెకలించాలి. నకిలీ మందులతో కోట్లకు పడగలెత్తిన వేయి పడగల విషనాగుల కోరలు పీకాలి. డిగ్నిఫైడ్ నేరగాళ్ల మాఫియా కోటలను తుదముట్టించాలి. నకిలీ మందుల బారిన పడి, ఆరోగ్యాలు చెడి అష్టకష్టాలు పడుతున్న అమాయకులకు ప్రభుత్వ



చట్టాల ద్వారా న్యాయం జరగాలి. వైద్య రంగంలో, ఫార్మా రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను కూలంకషంగా విశ్లేషించే ముందు అనేక విషయాలను గురించి ప్రస్తావించడం అవసరం. ఈ దిశగా ఒకసారి దృష్టి సారిద్దాం.

మానవ శరీరంలో అనేక అవయవాలున్నాయి. ప్రతీ అవయవానికి ఒక ప్రత్యేకత ఉంది. శరీరంలో అన్ని అవయవాలు ఒకదానితో మరొకటి సమన్వయంతో పని చేస్తాయి. ఏ అవయం సక్రమంగా పని చేయకపోయినా దాని ప్రభావం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఇతర శరీర భాగాలపై పడుతుంది. శరీరంలోని అన్ని భాగాలు సక్రమంగా పని చేయడం వలన మనిషి ఆరోగ్యవంతంగా జీవించగలుగుతాడు. ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. ధనాన్ని సంపాదించడానికి ఎన్నో మార్గాలున్నాయి. కానీ ఆరోగ్యం దెబ్బతింటే సాధించేదేమీ ఉండదు. శారీరకంగాను, మానసికంగాను దృఢంగా ఉండడాన్ని, శరీర భాగాలన్నీ సక్రమంగా పనిచేస్తూ, ఎలాంటి ఒడుదుడుకులు లేకుండా ఉత్సాహంగా ఉండడాన్ని 'ఆరోగ్యం' అంటారు. అలాంటి జీవితాన్ని గడిపేవారిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా పిలుస్తారు. శారీరకంగా దృఢంగా ఉన్నప్పటికీ, మానసిక ఆరోగ్యం సరిగా లేకపోతే వచ్చే ఇబ్బందులు అనేకం. ప్రతీ వ్యక్తి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నించాలి. దురదృష్టవశాత్తు ఇప్పటి ఆధునిక యుగంలో ప్రతీఒక్కరు ఏదో ఒక రోగంతో బాధపడుతూనే ఉన్నారు. తినే తిండి, తాగే నీళ్లు, పీల్చే గాలి.. అన్నీ కలుషితంగా మారిపోవడం వలన అనారోగ్యం బారిన పడి ఆసుపత్రుల వెంట పరుగెడుతున్నారు. విత్తనం నాటినప్పటి నుంచి పంట చేతికొచ్చేవరకు, మార్కెట్లో అమ్ముడు పోయేవరకు ఆహార పదార్థాలన్నీ విషతుల్యమైపోతున్నాయి. ఎరువులు, పురుగుమందులతో, ఆహార పదార్థాల నిల్వ కోసం వాడే రసాయనాలతో మనం తినే ఆహారం విషాహారంగా మారిపోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో 'ఆరోగ్యం' అనే పదం కూడా హాస్యాస్పదంగా మారిపోతున్నది. అనారోగ్యాన్ని



అంగట్లో కొని మన ముంగిట్లోకి ఏరికోరి ఆహ్వానిస్తున్నాం. కల్తీ వస్తువులతో, ఖరీదైన రోగాలు కొనితెచ్చుకుంటున్నాం. శరీర అవయవాలను అనారోగ్యానికి గురి చేస్తున్నాం. శారీరకంగాను, మానసికంగాను సాధారణ స్థితిని కోల్పోయి, అనారోగ్య స్థితి ఏర్పడడాన్ని 'రోగం లేదా జబ్బు' అని స్థూలంగా నిర్వచించవచ్చు. పూర్వ కాలంలో సైన్స్ అందుబాటులో లేని రోజుల్లో ఆకుల నుండి, చెట్ల బెరళ్ల నుండి ద్రవాలను తీసి రోగికి పట్టించేవారు. పూర్వకాలంలో సాంప్రదాయ వైద్య విధానాలను పాటించేవారు. అప్పటి ఆహారపుటలవాట్లు, కల్తీకారకాలు లేని బలవర్ధకమైన ఆహారం వలన రోగ నిరోధక శక్తి అధికంగా ఉండేది. పలు రోగాలు ఎలాంటి చికిత్స లేకుండా వాటంతట అవే తగ్గిపోయేవి. ఆత్మవిశ్వాసం, అరమరికలు లేని జీవన విధానం వలన మానసిక ఆరోగ్యం సమకూరేది. తాము చేసే పనులే తమ శరీరానికి వ్యాయామంలా పని చేసేవి. ఈ కారణాల వలన మనిషి ఆరోగ్యంగా ఉండేవాడు. అనారోగ్యం సోకితే చిన్న చిన్న చిట్కాలతో, పెరటి వైద్యంతో నయం చేయడం జరిగేది. 'లంకణం పరమ ఔషధం'గా పిలిచేవారు. రోగి శరీరాన్ని పస్తులుంచి, తర్వాత కొంత కాలంవరకు కఠినమైన ఆరోగ్య నిబంధనలు పాటించేవారు. ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి, యునాని వంటి వైద్య విధానాలు నేటికీ అమల్లో ఉన్నాయి. భారత ప్రభుత్వం కూడా ఆయుర్వేదాన్ని విశేషంగా ప్రోత్సహిస్తున్నది. అయితే అల్లోపతి లేదా ఇంగ్లీషు వైద్యం పట్ల ప్రపంచమంతా మక్కువ ప్రదర్శిస్తున్నది. రోగాలకు అత్యంత అధునాతన పద్ధతులు కనిపెట్టడం, వివిధ రకాల పరికరాల సాయంతో రోగ నిర్ధారణ చేసి చికిత్స అందించడంలో అల్లోపతి వైద్యం ప్రధాన పాత్ర వహిస్తున్నది. విరిగిన ఎముకలను శస్త్రచికిత్స ద్వారా అతికించడం, కృత్రిమ అవయవాలను తయారు చేయడం,

గుండెమార్పిడి, కిడ్నీమార్పిడి, ప్లాస్టిక్ సర్జరీ వంటి విషయాల్లో సైన్స్ అత్యంత ముందంజలో దూసుకుపోతున్నది. అయితే అతిపెద్ద అంటురోగాలు సోకితే గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టుకుపోయిన సంఘటనలు అనేకం. అంటువ్యాధులు, మహమ్మారులు, ప్రపంచానికి కొత్తకాదు. వర్తమానంలో మనం ఎదుర్కొంటున్న కరోనా మహమ్మారి గురించి మనకు తెలుసు. కరోనా కంటే భయంకరమైన మరెన్నో ప్రాణాంతకమైన మహమ్మారులకు ఈ ప్రపంచం అతలాకుతలమైన సంగతి చాలా మందికి తెలియకపోవచ్చు. ప్లేగు, మశూచి, క్షయ, స్పానిష్ ఫ్లూ వలన కోట్లాది మంది ప్రజలు అప్పట్లో పిట్టల్లా రాలిపోయారు. బ్లాక్ డెత్‌గా పిలవబడే ఎలుకల ద్వారా వ్యాప్తి చెందే ప్లేగు వ్యాధి వలన ప్రపంచ వ్యాప్తంగా 5 కోట్ల మంది మరణించారు. యూరప్ దాదాపుగా తుడిచిపెట్టుకుపోయింది. నాటి మహమ్మారులు సృష్టించిన విలయంతో పోల్చి చూస్తే కరోనా విలయం తీవ్రమైనది కాకపోవచ్చు. కానీ వైద్య శాస్త్రం అంతగా అభివృద్ధి చెందని నాటి కాలంతో పోల్చి చూస్తే వైద్య సదుపాయాలు పెరిగి, ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెరిగిన వర్తమానంలో లక్షలాది మంది ప్రజలు మృత్యువాత పడడం బాధాకరం. కరోనాను తక్కువ అంచనా వేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితమే లక్షలాది మరణాలకు కారణంగా పేర్కొనవచ్చు. వివిధ రోగాలకు ఎన్నో ఔషధాలు కనుగొనబడుతున్నాయి. అయితే పెరిగిన మానవ స్వార్థం వలన ఎన్నో ఔషధాలు కల్తీమయమైపోతున్నాయి. నకిలీ మందులు జన జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. కరోనా ప్రారంభ దశలో అనేక కథనాలు వ్యాప్తిలోకి వచ్చాయి. కరోనా అనేది ఒక 'మెడికల్ మాఫియా'గా పేర్కొన్నవారు కూడా లేకపోలేదు. అయితే నిజాలు నిగ్గు తేలేవరకు ఎవరిపైనా విమర్శలు చేయడం సహేతుకం కాదు. అయితే ఆ సమయంలో నకిలీ మందుల ప్రభావం విచ్చలవిడిగా సాగింది. వైద్యశాస్త్రం తలవంపులకు గురైంది. నకిలీ మందుల దందా విశృంఖలంగా సాగింది. అనారోగ్యాన్ని పోగొట్టి ఔషధాలతో ఉపశమనం కలిగించి, ఆరోగ్యవంతులను చేయడానికి వినియోగించే ఔషధాలను కూడా కల్తీ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. రోగుల ప్రాణాలతో చెలగాటమాడే ఈ నకిలీ మందుల సామ్రాజ్యాలు కోకొల్లలుగా ఉన్నట్టు తెలుస్తున్నది. నిజమైన ఔషధాలను మైమరపిస్తూ ఏది నిజమో, ఏది మోసపూరితమో అర్థంకాని ఆధునిక పరిజ్ఞానంతో తయారౌతున్న నకిలీ మందులను గుర్తించడం ఔషధ వినియోగదారులకు విషమ పరీక్ష. నకిలీ మందులను వినియోగించి, లేనిపోని అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకోవడం, కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోవడం జరుగుతున్నది. వైద్య శాస్త్రానికి, ఫార్మసీ రంగానికి తలవంపులు తెస్తున్న ఈ నకిలీ మందుల దందాను అరికట్టకపోతే జరగబోయే పరిణామాలు ఊహించడం కూడా కష్టం. మొక్కలుగా మొదలై మహావృక్షంలా వేళ్లానుకుపోయిన నకిలీ మందుల



కోటలను కూలగొట్టాలి.

చట్టబద్ధంగా తయారు చేస్తూ, చట్టబద్ధమైన వైద్యుల సిఫార్సులతో రోగులకు ఇచ్చే మందులను "ప్రిస్క్రిప్షన్ డ్రగ్స్" అంటారు. వైద్యులు సూచించే మందులు లైసెన్స్ గల మందుల షాపుల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా రోగులకు అందించబడతాయి. కొన్ని రకాల మందులను వైద్యుల సిఫార్సు లేకుండా ఫార్మాసిస్టులు వివిధ రోగాలకు అందిస్తారు. వీటి వలన ఎలాంటి అపాయం ఉండదు. వీటిని ఓ.టి.సి.డ్రగ్స్ అని కూడా పిలుస్తారు. హెరాయిన్, కొకైన్, మార్జువానా మొదలైనవి అబ్యూస్డ్ డ్రగ్స్‌గా పేర్కొంటారు. ఈ మాదక ద్రవ్యాల వలన మానవ శక్తి నిర్వీర్యమైపోతుంది. వీటిని అమ్మడం, వినియోగించడం చట్ట రీత్యా నేరం. ఔషధాలకు సంబంధించిన ఫార్ములా తయారు చేసి, ఆ ఔషధాలపై పేటెంట్ హక్కులు పొంది, రెండు దశాబ్దాల తర్వాత ఇతర సంస్థలు అదే ఫార్ములాతో వాటిని జనరిక్ మందుల షాపుల్లో తక్కువ ధరకు విక్రయించుకునే చట్టబద్ధమైన సౌలభ్యం ఏర్పడిన నేపథ్యంలో జనరిక్ మందులు తక్కువ ధరకు లభ్యమవుతున్నాయి. ఇవి పేదల కోసం ఉద్దేశించబడ్డాయి. జనరిక్ మందులపై వైద్యులు శ్రద్ధ చూపాలి. చౌక ధరలకు లభ్యమయ్యే మందులను వినియోగంలోకి తేవడానికి ప్రోత్సహించాలి. సామాన్యులకు, పేదలకు ఇప్పుడు నాణ్యమైన వైద్యం ఒక అందని ద్రాక్షలా మారిపోయింది. ఎక్కడ చూసినా నకిలీ మందులే. ఏ నోట విన్నా నకిలీ మందుల ప్రస్తావనే. అయితే నకిలీ మందులను గురించి, ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రభుత్వాల, ప్రభుత్వ యంత్రాంగాల బాధ్యత.

నాణ్యమైన వైద్యం అత్యంత ఖరీదైన వ్యవహారంలా మారిపోయింది. పూట గడవడం కష్టమైన పేదవారు వేలు, లక్షలు పెట్టి వైద్యం చేయించుకోవడం అత్యంత దుర్లభం. ఈ బలహీనతను ఆసరాగా భావించి, కారుచౌక మందులతో అసలును పోలిన నకిలీ మందులతో జనజీవనంలోకి ప్రవేశిస్తున్న నేరమయి ప్రపంచపు కారు చీకట్లు ప్రజారోగ్యపై పెను ప్రభావం చూపెడుతున్న నేపథ్యంలో నకిలీ లీలలకు చరమగీతం పాడేదెప్పుడు?

అత్యంత ప్రమాదకరమైన అంటువ్యాధుల నుండి, ఇతర భయంకరమైన వ్యాధుల నుండి కాపాడడంలో యాంటీ బయాటిక్స్ పాత్ర కీలకం.

నకిలీ ముఠాలను కనిపెట్టడం కష్టమే! అయితే వీటిని కూడా కల్తీ చేస్తూ, తయారు చేస్తున్న నకిలీ డ్రగ్స్ ముఠాను కనిపెట్టడం క్లిష్టంగా మారింది. కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో డ్రగ్స్ తయారీ కంపెనీల పైన, డ్రగ్స్ అమ్మకందారులపైన అత్యంత కఠినమైన నిబంధనలు అమలు జరుగుతున్నాయి. డ్రగ్స్‌లో కల్తీని కనిపెట్టడానికి ఏది నిజమైన ఔషధమో, కాదో తెలుసుకునే అధునాతన వ్యవస్థలు ఉన్నాయి. నకిలీ మందుల వ్యవహారం కేవలం మన దేశంలోనే కాదు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న అనైతిక, చట్ట వ్యతిరేకమైన వ్యవహారం. ఏదైనా ఒక వ్యాధికి ఔషధం కనిపెట్టడం సామాన్యమైన విషయం కాదు.

ప్రభుత్వాల అనుమతితో జంతువుల పైన, ఇతర జీవాల పైన అనేక ప్రయోగాలు జరిపిన తర్వాత వాటి ఫలితాలను బట్టి ఆయా దేశాలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల మేరకు నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో విజయం సాధిస్తేనే దానికి చట్టబద్ధమైన గుర్తింపు లభిస్తుంది. తాము రూపొందించిన డ్రగ్‌పై పేటెంట్ హక్కులు పొందడం దగ్గర నుంచి డ్రగ్స్ తయారీ వరకు సాగే అత్యంత సుదీర్ఘమైన ప్రక్రియలో ఎన్నో అవరోధాలను, పరీక్షలను ఎదుర్కోవలసి ఉంటుంది. అయితే ఇవేమీ లేకుండా నకిలీ ఫార్ములాతో, చౌకరకమైన, నాణ్యత లేని రసాయనిక పదార్థాలతో డ్రగ్స్‌ను తయారు చేసి, ఔషధ వినియోగదారులపై వాటిని వదిలి, బిలియన్ల డాలర్ల వ్యాపారం చేస్తూ అపర కుబేరులుగా మారడం, అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడం అత్యంత అమానుషం.

**శక్తివంతమైన ఫార్మా నెట్‌వర్క్ కలిగిన అమెరికా**

అమెరికా అత్యంత నైపుణ్యంగల ఫార్మా కంపెనీలతో అత్యంత శక్తివంతమైన ఫార్మా నెట్‌వర్క్ కలిగి వుంది. 2021 సంవత్సరం నాటికి ఇండియా ఫార్మా పరిశ్రమ విలువ 40 యు.ఎస్.బిలియన్ల డాలర్లపైనే. అత్యధిక జనరిక్ మందుల ఎగుమతి దేశంగా భారత్ ప్రపంచ జనరిక్ మందుల ఎగుమతుల్లో 20 శాతం వాటా కలిగి వుంది. అమెరికా, జపాన్, చైనా, జర్మనీ, ఫ్రాన్స్, బ్రెజిల్‌లలో అత్యధిక ఔషధ కంపెనీలున్నాయి. భారతదేశానికి చెందిన డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీ, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ అథారిటీ గతం లో వేలాది డ్రగ్ నమూనాలను సేకరించి, పరీక్షించడం జరిగింది. తర్వాత కొన్ని సంస్థలు జరిపిన డ్రగ్స్ పరిశోధనల్లో వినియోగంలో ఉన్న 25 శాతం ఔషధాలు నకిలీ అని తేల్చడం జరిగింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల కొరత, వైద్య పరమైన యంత్రాంగాలు తగిన స్థాయిలో లేకపోవడం, ఔషధ తయారీదారుల పైన, ఔషధ విక్రేతల పైన తగినంత నిఘా లేకపోవడం, చూసీ చూడనట్లు నిర్లిప్తత ప్రదర్శించడం, అవినీతి వ్యవహారాల వలన నకిలీ మందుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. బిలియన్ల డాలర్ల సంపద నకిలీ మందుల తయారీదారుల చెంత మూలుగుతున్నట్టుగా అనేక సర్వేలు తేటతెల్లం చేస్తున్నాయి. కేవలం మన దేశంలోనే కాదు.. అమెరికా, చైనా వంటి అగ్ర దేశాల్లోను, పాకిస్తాన్ వంటి పేద దేశాల్లోను నకిలీ మందుల హవా యథేచ్ఛగా కొనసాగుతున్నది. అడ్డదారుల్లో అక్రమ సంపాదన కోసం వెంపర్లాడే క్రమంలో అత్యంత లాభసాటి వ్యాపారంగా నకిలీ మందుల తయారీ వ్యవస్థ అంకురించింది. నకిలీ మందుల వలన, నకిలీ వైద్య పరికరాల వలన, నాణ్యత లేని లేబొరేటరీల వలన ఎంతో మంది అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అయినా నకిలీ మందుల వ్యాపారం ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నది.

అమెరికాలో ఆహారం, ఔషధాల



విషయాల్లో నియంత్రణ కోసం ఏర్పడిన ఒక చట్టబద్ధమైన వ్యవస్థ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్.డి.ఏ). ప్రజారోగ్యం కోసం ఏర్పడిన ఈ వ్యవస్థ 1906వ సంవత్సరంలో పూర్తి స్థాయిలో పని చేయడం ప్రారంభించింది. చట్టబద్ధంగా అమెరికాలోకి దిగుమతి కాబడిన అనేక ఔషధాలు కూడా నకిలీవిగా గుర్తించింది. ఇవి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్నట్లు ఎఫ్.డి.ఏ. తెలిపింది.

చైనాలో గతంలో ఉన్న ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ స్థానంలో నేషనల్ మెడికల్ ప్రొడక్ట్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్.ఎమ్.పి) 2013లో ఏర్పడింది. ఆహారంతో పాటు ఔషధాలు, వైద్య పరికరాల విషయంలో ప్రజలకు భద్రత కల్పించడానికి ఇది ఏర్పడింది. నకిలీ మందులు వాడకుండా అందరికీ సరసమైన ధరలకు ఔషధాలు అందించాలనే ధ్యేయంతో ఇండియాలో ఔషధాల ధరలను నియంత్రించడానికి డ్రగ్ 'కంట్రోల్ యాక్ట్ 1950' ఏర్పడింది. తర్వాత అనేక సంస్థలు నకిలీ మందులపై నిఘా పెంచాయి.

పెయింటింగ్‌లు, పెన్నులు తయారు చేసే పరిశ్రమల్లో వినియోగించే విషపూరిత పదార్థాలను దగ్గుమందులో ఉపయోగించడం వలన చాలా మంది పిల్లలు అస్వస్థతకు గురికావడం, చనిపోవడం వంటి సంఘటనలు గతంలో భారతదేశంలో చోటు చేసుకున్నాయి. భాతరదేశంలో తయారైన కొన్ని దగ్గుమందుల వలన ఇతర దేశాల్లో కొంతమంది చనిపోయిన సంఘటనలు, దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించిన విషయం విదితమే.

**ప్రజల్లో అవగాహన కలగాలి**

అయితే నకిలీ మందులను అరికట్టడంలో ప్రభుత్వ చట్టాలు మాత్రమే సరిపోవు. ప్రజల్లో కూడా అవగాహన కలగాలి. చట్టబద్ధమైన ఔషధ తనిఖీ యంత్రాంగాలు అత్యంత అప్రమత్తతతో పని చేయాలి. ఔషధ తయారీ సంస్థల పైన వైద్యులు రోగులకు ఇచ్చే మందుల పైన నిరంతర పర్యవేక్షణ అవసరం. నకిలీ ఔషధాల తయారీదా రులను, విక్రేతలను శిక్షించడానికి కఠినమైన చట్టాలు రూపొందించాలి.

భారతదేశంలో వేలాది ఔషధ కంపెనీలున్నాయి. పది వేలకు పైగా ఔషధ తయారీ కేంద్రాల్లో అనేక జనరిక్ మందులు తయారౌతున్నాయి. మన దేశంలో ఉపయోగించే ఔషధాల్లో వినియోగించే రసాయనాల్లో అధిక భాగం చైనా సరఫరా చేస్తున్నది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే మందుల్లోను, మందుల తయారీలో వినియోగించే రసాయనాల విషయంలో మన దేశం మరింత జాగరూకత వహించాలి. భారతదేశం ప్రస్తుతం ప్రపంచ దేశాలకు ఔషధాలను ఎగుమతి చేసే దేశంగా మారింది. ఔషధాల విషయంలో భారత్ సాధించిన అద్భుతమైన ప్రగతికి ఇది నిదర్శనం. ఇతర దేశాల కంటే తక్కువ ధరలకు మందులను ఎగుమతి చేస్తూ భారతదేశం ఫార్మసీ హబ్‌గా మారింది. అమెరికాలో విక్రయించే మందుల్లో సుమారు 40 శాతం, బ్రిటన్ విక్రయించే మందుల్లో 24 శాతం పైగా జనరిక్, ఓవర్ ద కౌంటర్ మందులు భారతదేశానికి చెందినవి కావడం విశేషం.

**(మిగతా 22వ పేజీలో)**

## ఈ వారం కవిత్వం



# నన్ను చిగురించనివ్వు

నేను ఈ భూమి ఆకాశం మధ్య
ఒక అందమైన అద్భుతలోకం నేను
అది నీకు తెలిసినా ఎందుకు
తెలియనట్టు ప్రవర్తిస్తున్నావో నాకు తెలియట్లేదు..
నేను ఈ భూమికి పచ్చని సింధూర తిలకాన్ని
ప్రకృతి రమణీయతకు శోభను కూర్చే కళారూపాన్ని
భూతల్లి గర్భం నుంచి చిరు ప్రాణం పోసుకొని
ఈ లోకంలోకి వచ్చిన ఒక తరువుని నీకొక ఆధారాన్ని!
నేను సూర్యునితో పోరాడి
నీకు చల్లని నీడనిస్తున్నా
నేను వాయువుతో పోరాడి నీకు ప్రాణ వాయువునిస్తున్నా
నేను మేఘంతో కలిసి నీకు వర్షాన్నిస్తున్నా
నీకు తోడుగా తోబుట్టువుగా నీతో ఉంటున్నాను కదా!
నీ అవసరాలకు.. నీ సుఖాలకు లేలేత చిగురుకొమ్మలని
కొమ్మచాటున రెమ్మలని నా శరీరం లాంటి మొదులుని
మొదులుకు ప్రాణమైన వేర్లని
తల్లి నుంచి బిడ్డను వేరు చేసినట్టు
ఈ భూమి నుంచి నన్ను
వేరు చేస్తున్నారు.. న్యాయమా?
నీ నుంచి నన్ను నేను రక్షించుకొంటూ
నిన్ను రక్షిస్తూనే.. ఆ సంగతి మరిచి
నన్ను నువ్వు బతికుండగానే
చిన్న మొక్క నుంచి మహావృక్షాన్ని సైతం
నీ అహంకార మత్తులో నన్ను అదమరుస్తుంటే
నేనెట్టా బతకాలి? నిన్ను ఎట్టా బతికించాలి
నన్ను బతకనివ్వు.. నా ఆశలు చిగురించనివ్వు
ఓ మహావృక్షమై నిన్ను ఈ సమస్తాన్ని
నా కౌగిలి చేర్చుకొని కంటిపాపలా కాపుకాస్తా
నేనే కదా నీ ఆయువుని అడుగడుగునా నీ అవసరాలు
తీర్చే అమ్మలాంటిదాన్ని నన్ను కాస్తా 'చిగురించనివ్వు'

**- లక్ష్మీ శ్రీనివాస్**

# తప్పెవరిది?

**ఒక్కో** అక్షరానికి
మెదడులో విస్ఫోటనం
పద పదానికి
గుండెల్లో శతఘ్నులు
వాక్య వాక్యానికి
కళ్లల్లో అగ్నిపర్వతాలు
భావ భావానికీ
ఆలోచనల్లో భూకంపం
కాగితంపై
సిరాకు బదులు రక్తం
పారుతోంది
కలం పట్టుకున్న వేళ్ల
చిగురుటాకులా
వణుకుతున్నాయి



సమాజం ఎటు
పోతోంది
మనిషి ఏమౌతున్నాడు
స్కూలు వయసులోనే
మృగంగా మారుతుంటే
సమాజాన్ని చూడని
వయసులోనే
తోటి ఆడపిల్లను
కర్కశంగా మింగుతుంటే
ఎవరిది తప్పు..
ఏమో.. కర్ణుడి చావుకు
సవాలక్ష కారణాలన్నట్లు
ఆధునిక విజ్ఞానానిదా,
సమాజానిదా, పెంపకానిదా,
అభం శుభం తెలియక చేసిన
స్నేహానిదా
కళ్లు మసక బారుతున్నాయి
రాసే అక్షరాలు
చెరిగిపోతున్నాయి
కలానికి పక్షవాతం
వచ్చినట్లైతోంది
కాగితం చినిగిపోయింది
పాళీ విరిగిపోయింది.

**- జి.మధుమురళి**

**బరువు** బాధ్యతల కిరీటం
మోయడం అంత తేలిక కాదేమో!
తాపత్రయాలు లేనప్పుడు/ మనసు మంచుపర్వతమే!
చీకటి వెలుగులు మునిగి తేలుట/ ముల్లోకాలకు ముచ్చటే!
ఎద ఊసుల కిరణం సోకిన చోట
నీవు ఉన్నట్లే కదా!/ నీ దగ్గర ఏమీ లేదనుకోకు
ఏమి చేయాలో తోచక పోవడమే!
తోచినవాళ్లు ఒప్పుకోరు/ పసివాళ్లను మెప్పించడం కష్టమే!
మౌన సాక్షి ఏమీ చెప్పదు
మౌనం అంగీకారం అనుకోవడమే!
దీపం వెలుగుతూ ఉంటే/ తమస్సులు సేదతీరడమే!
కలువలు రేరాజును కలవడం/ పరవసించి కొలనులో
వికసించడమే!

**- పి.బక్కారెడ్డి**

# మనసు మంచుపర్వతమే!



# పుస్తక సమీక్ష

## వయోజనులకు ప్రయోజనం



ఆకట్టుకునేట్టు చెప్పగల సామర్థ్యం సాహితీవేత్త, ఆల్ఇండియా రేడియో ప్రయోక్త అల్లంరాజు వెంకటరావుకు ఉంది. 'సుధామ'గా పాఠకలోకానికి సుపరిచితులు. జోక్స్, పజిల్స్, పీఠికలు, పరిచయవ్యాసాలు, కార్టూనులు, చిత్రాలు ఏ ప్రక్రియ చేపట్టినా 'గట్టిపట్టు' కనిపిస్తుంది. కవి, సమీక్షకులు రచయిత, కాలమ్నిస్టు, సభ నిర్వహణా సమర్థులుగా పేరుగాంచిన 'సుధామ' ఈతేప సీనియర్ సిటిజన్స్ కబుర్లు మనకు వినిపిస్తున్నారు. ఒక మాసపత్రికలో 2017-2021 మధ్యకాలంలో ధారావాహికగా వెలువడి ప్రశంసలందుకున్న వ్యాసాలు, పుస్తక రూపంగా మనకందిస్తున్నారు రచయిత. 41 అధ్యాయాలున్న ఈ సంపుటిలో వయోవృద్ధులు వారి మానసిక శారీరక ఆరోగ్యం, తీసుకోవల్సిన జాగ్రత్తలు, సమాజంలో వారిని వారి బంధువులు, ఎలా 'ట్రీట్' చేస్తారు, వారి ఆర్థిక సమస్యలు వారి రక్షణకై రూపొందించిన చట్టాలు, ప్రశాంత జీవనానికి పాటించాల్సిన సూత్రాలు, ప్రాచుర్యంలోకి వస్తోన్న వృద్ధాశ్రమ జీవితం' ఇవీ,అవీ, అని కాదు అన్నింటి గురించి ఈ వ్యాసాల్లో సుధామ చర్చించారు. మరోలా చెప్పాలంటే ఈ చిన్నిసంపుటి వృద్ధులు/వృద్ధాశ్రమాల పాలిటి 'ఎన్సైక్లోపీడియా' అనదగిన గ్రంథం. ప్రతివ్యక్తి, విధిగా, తప్పనిసరిగా అనుభవించవలసిన వృద్ధాప్యాన్ని సంతోషంగా ఎదుర్కునేందుకు ఒక గొప్ప 'ఉపకరణం'.

**(జీవన సంధ్య (వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్) వ్యాసాలు, రచన: సుధామ, వెల: రూ 120, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకాలయాలు)** **- కూర చిదంబరం**

## కవిత్వమై ఉప్పొంగిన హృదయభాష



కవి డా.జెల్ది విద్యాధర్ రావు 94 కవితల్లో మన 'అంతరంగపు భాష'తో వ్యక్తమవుతున్నాడు. ఈ ఐఆర్ఎస్ అధికారి నాకు వ్యక్తిగతంగా తెలుసు. ప్రతి కవితలో తన సంస్కారవంతమైన వ్యక్తిత్వంతో పలకరిస్తాడు. జెవిఆర్ స్నేహకవి. మానవ సంబంధాలను కలకాలం కాపాడుకోవాలన్న తపన ఆయనది. 'మానవ సంబంధాలు..పెంపుడు పక్షులవంటివి/ అనుబంధాలను గాఢంగా నిలుపుకోవాలి/ స్నేహసంబంధాలు గాఢంగా పొదువుకోవాలి' అనడమే గాదు..ఆచరణలో పెట్టే నిజాయితీపరుడు. ఈ కవి గొప్ప మానవతావాది. స్త్రీలపట్ల ఆపారమైన గౌరవం. జీవిత భాగస్వామి పట్ల ప్రేమానురాగాలు మెండు. 'కనురెప్పలను గులాబీ రెక్కలుగా.. /ఇల్లంతా పరచి ఇలవేల్పు వై నిలచి../ ఆర్తిగొన్న ప్రాణానికి అమృతాన్ని పోసి../ నను ఓర్చి దరిచేర్చిన/ నా జీవన సహచరీ!' అని పరవశిస్తాడు. ప్రేమ కవిత్వమే గాదు..భావ కవిత్వం రాయడంలోనూ దిట్ట. అవయవ దానాల హేతుబద్ధతను ప్రశ్నిస్తూ రాసిన 'ఇదంతా నిజంగా.. నిజమేనా?' అనే కవిత వేల ప్రశ్నలను రేకెత్తిస్తుంది. కొత్త ఆలోచనలకు తెరతీస్తుంది. సందర్భోచిత కవితలు, సంఘటనలకు తీవ్రంగా చలించి స్పందించిన కవితలు చాలానే వున్నాయి. వలస కార్మికులను వలస పక్షులు కాదు..వలస పావురాలు అనడం బాగుంది. మొదటి ప్రయత్నంలోనే మూసపద్ధతికి విరుద్ధంగా ప్రత్యేక అభివ్యక్తితో తనదైన మార్క్ వేసుకున్నాడు జెల్ది. హృదయభాషను కవిత్వీకరిస్తు మున్ముందు వడివడిగా అడుగులేస్తాడని నా నమ్మకం. **(అంతరంగపు భాష, రచన: డా.జెల్ది విద్యాధర్‌రావు, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ, నవ చైతన్య బుక్‌హౌస్‌లు)** **- రమణ వెలమకన్ని**

## మనిషి గుర్తుల్ని బతికించుకుందాం

చందలూరి నారాయణరావు రచించిన 65 కవితల సంపుటి 'మనిషి గుర్తుల్ని బతికించుకుందాం'. మనిషిని మానవత్వాన్ని బతికించాలన్న ఆలోచన కవితలలో అంతర్గతంగా కనిపిస్తుంది. సమకాలీన సమాజంలోని సమస్యలను, అసమానతలను, అన్యాయాలను నిక్కచ్చిగా



ప్రదర్శిస్తాడు కవి తన కవితలలో. 'నిజం పిచ్చిదే/ నిజం మాట్లాడితే పిచ్చోడే' అంటాడు. 'మరణం లేదు' కవితలో 'ఇరుకువీధుల్లో చిక్కిన చినుకు కిన్నెరతో/ బురద మేటవేసిన/ జీవితాలు 'కన్నీటి వరద' పాలు' అంటాడు. 'సృష్టించిన చీకటి' కవితలో 'ఆ తొలి చూపే తొలకరి/ ఎన్నో భావాలకు ఊపిరి' అనే అందమైన భావం 'నవ్వుల చెట్టు' కవితలో కనిపిస్తుంది.


'కళ్లముందే ప్రాణం విలవిలలాడుతూ/ విగతజీవిగా మారడాన్ని చూసి/ వీధి తల కొట్టుకుంటుంటే/ మనిషి తప్పుకుపోయాడు/ మనిషితనం చచ్చిపోయింద'ని మానవత్వం నశించటం చూసి విలపిస్తాడు కవి 'తప్పుకుపోతాం' కవితలో. ఈ రకంగా విభిన్నమైన భావాలను, ఆలోచనలను సూటిగా, స్పష్టంగా ప్రదర్శిస్తాయీ సంకలనంలోని కవితలు.

**(మనిషి గుర్తుల్ని బతికించుకుందాం, రచన: చందలూరి నారాయణరావు, వెల: రూ 100, ప్రతులకు: సి.నారాయణరావు, ఇ.నం. 30-101, ఓల్డ్‌బస్టాండ్ సెంటర్, అద్దంకి, బాపట్ల జిల్లా)**

**- నిర్మోహి**

## 'ఆనంద్' అద్భుత బొమ్మలు

ప్రముఖ ఆర్టిస్ట్ శిరంశెట్టి ఆనంద్, తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకలుగా 101 బొమ్మలతో బతుకమ్మను అద్భుతంగా చిత్రీకరించారు. తెలంగాణ రాష్ట్ర పండుగగా, గుర్తింపబడుతున్న బతుకమ్మ ఆరాధన రాష్ట్రమంతటా తెలంగాణ సంస్కృతి,



ఆధ్యాత్మిక కళాత్మక సౌందర్య ఔన్నత్యంతో, తొమ్మిది రోజుల సంబరాలుగా విలసిల్లుతోంది. చిత్రకారునికి నవరాత్రుల సందర్భం విశేషాలను, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, వికాసాభ్యుదయ రథసారథుల చిత్రాలను జతపరిచి ప్రచురించడంతో ఈ పుస్తకం విశేషాంశంగా ప్రశంసాయుతమైంది. బొమ్మలే ప్రాణంగా చిత్రకళారీతులలో సవ్యసాచి అయిన ఆనంద్, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, సాంస్కృతిక వికాస చైతన్యం, నగరాలలో పల్లెలలో బతుకమ్మ సంబరచిత్రాలను తన కుంచెతో రమణీయంగా తీర్చిదిద్దారు.. నవ్వుల, పువ్వుల చిత్రకళా రంగుల ప్రతిభా సమన్వితంగా, ముఖ్యమంత్రి కెసిఆర్, కవిత, కె.టి.ఆర్ వంటి ప్రస్తుత ప్రముఖ నేతలేకాకుండా దాశరథి, కాళోజీ, ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, కొమరంభీమ్, కొండాలక్ష్మన్, జయశంకర్‌వంటి మహనీయులను 'బతుకమ్మ మహోత్సవానికి అనుసంధానం చేయటం ప్రశంసనీయం. **(బతుకమ్మ, ఆనంద్ చిత్రాలు, కార్టూన్లు, వెల: రూ 100, ప్రతులకు: సాయిశ్రీ పబ్లికేషన్స్, ఇ.నం.1-10-114, 17వ వార్డు, నూతన వ్యవసాయ మార్కెట్ పక్కన, అంబేద్కర్ నగర్, సూర్యాపేట జిల్లా)** **- యర్రమిల్లి**



# ఖజురహో శిల్పకళలో అదరహో

షేక్ అబ్దుల్ హాకీం జాని

మన దేశంలో శిల్ప కళా సంపదతో భాసిల్లుతున్న దేవాలయాలు అనేకం ఉన్నాయి. అటువంటి వాటిలో ఖజురహో ఒకటి. మధ్యప్రదేశ్‌లోని భరత్‌పూర్‌కు 27 మైళ్ల దూరంలో ఛత్తర్‌పూర్ జిల్లాలోని నెలకొని ఉన్న చిన్న గ్రామం ఖజురహో. ఢిల్లీ నగరానికి 620 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడి నిర్మాణ సమూహాలు యునెస్కో వారిచే ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపబడ్డాయి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఖర్జూరపు చెట్లు హెచ్చుగా ఉండటంతో ఈ ప్రాంతానికి ఖజురహో అనే పేరు వచ్చినట్లు తెలుస్తుంది. ఖజురహో 950 నుండి 1050 ప్రాంతంలో 'చందేల' అనే రాజపుత్ర వంశస్థుల సామ్రాజ్యపు రాజధానిగా భాసిల్లింది. 10 నుండి 12వ శతాబ్ద కాలం వరకు భారతదేశంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన చందేల అనే రాజపుత్ర వంశస్థుల రాజధానిగా వర్ధిల్లింది.

ఈ దేవాలయాల సమూహాలు 950 నుండి 1050 మధ్య సుమారు వంద సంవత్సరాల కాలంలో కొన్ని తరాల రాజులచే నిర్మింపబడ్డాయి. తరువాత కాలంలో చందేల రాజధాని మహోబాకు మార్చారు. ఈ ప్రదేశంలో 8 ద్వారాలతో కూడిన కుడ్యం ఉంది. ప్రతి ద్వారం రెండు బంగారు కొబ్బరి కాండముల మధ్య ఉన్నది. సుమారు 8 చదరపు మైళ్లు అంటే 21 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఒకప్పుడు 85కి పైగా దేవాలయాలు పరుచుకొని ఉన్నాయి. సుమారు వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ విశిష్ట ఆలయాలు ఎన్నో ప్రకృతి వైపరీత్యాలకు గురయ్యాయి. కాలగతిన, నిర్లక్ష్యానికి గురై ప్రస్తుతం 25 ఆలయాలు మాత్రమే చెప్పు కోదగినంత వరకు పునరుద్ధరించబడ్డాయి. బ్రిటిష్ హయాంలో 16వ శతాబ్దానికే అంతా కనుమరుగైపోయింది. చాలా కాలపు నిర్లక్ష్యం తరువాత బ్రిటిష్‌వారి హయాంలోనే 1839లో వెలుగు చూసింది. తవ్వకాలలో అనేక విషయాలు తెలిసాయి.

## ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు

ఖజురహో అనేది మధ్య యుగ కాలానికి చెందిన హిందూ, జైన మతానికి చెందిన దేవాలయాలను అతిపెద్ద సంఖ్యలో కలిగిన ప్రదేశం. వాస్తుకళ, శిల్పకళల మేలు కలయికగా ఉండే ఈ ఆలయ ప్రాంగణం, కామకేళి శిల్ప సంపద ద్వారా ప్రఖ్యాతి గాంచింది. ఖజురహో దేవాలయాలను 1986లో యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించి ప్రపంచ వ్యాప్త గుర్తింపునిచ్చారు. చందేల సామ్రాజ్య స్థాపకుడైన చంద్రవర్మ ఇక్కడ 10వ శతాబ్దంలో ఆలయ నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా అతని వారసులు ఆ నిర్మాణాలను వందేళ్ల పాటు కొనసాగించి పూర్తి చేశారు. చంద్రవర్మ తన తల్లి కోరిక మేరకే ఖజురహో దేవాలయాల నిర్మాణాన్ని ప్రారంభించాడని చరిత్ర చెబుతుంది.

భారతదేశంలోని ఆలయ నిర్మాణాలలో ఖజురహో మహాద్భుతమని చెప్పవచ్చు. ఒకప్పుడు ఖజురహోలో 85కు పైగా ఆలయాలు నిర్మించగా ఇప్పుడు కేవలం 25 మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ ఆలయాలు అద్భుతమైన శిల్పకళకు ప్రతీకలుగా నిలిచి పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఆ కాలంలో ఇక్కడ 65 తటాకాలు నిర్మించగా ఇప్పుడు మూడు మాత్రమే మిగిలాయి. కొన్ని ఆలయాలపై యుద్ధాలలో ఉపయోగించే గుర్రాలు, ఏనుగులు, ఒంటెలు, వీరాధివీరులతో పాటు చెట్లశిల్పాలు దీనిపై శిల్పీకరించారు.

ఖజురహో ప్రాంత శిల్పాలకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రాచీన భారతదేశంలో గురుకుల నియమం ప్రకారం ప్రతి విద్యార్థికీ వివాహానికి ముందు 12 సంవత్సరాలు బ్రహ్మచర్యం తప్పనిసరి. నాటి విద్యార్థులు బ్రహ్మచర్యం పాటించే సమయంలో ఖజురహో శిల్పాలను






తిలకించి అధ్యయనం చేసి తద్వారా భవిష్యత్తులో గృహస్థాశ్రమంలో అవసరమైన జ్ఞానాన్ని పొందేవారు. ప్రాపంచిక సుఖాలలోని అశాశ్వతత్వాన్ని సైతం ఈ శిల్పాల ద్వారా తెలుసుకునేవారు. ఈ విధంగా సంసార జీవితం తరువాత సత్యాన్వేషణా పథంలో అవసరమైన వైరాగ్యానికి వారు యుక్త వయస్సులో ఉండగానే తెలుసుకునేవారు. శారీరకమైన వాంఛలు మనిషిని ఏ గమ్యానికీ చేర్చలేవని చెప్పడమే ఈ ఆలయ నిర్మాణం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. అందుకు తగినట్లుగానే ప్రాకారాలపై పలు రకాల భంగిమలలో శిల్పాలు జీవం ఉట్టిపడే విధంగా మలచిన ఈ ఆలయ అంతర్భాగంలో ఏ దేవుని విగ్రహమూ కనిపించదు.

మత సామరస్యంతో జైన ఆలయాల నిర్మాణం చందేల రాజుల కాలంలోనే హిందూ, జైన మతాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. రాజపుత్రులు హిందువులే అయినప్పటికీ ప్రజల్లో అనేకమంది జైన మతస్థులు ఉండటంతో పరమత సహనాన్ని పాటించి హిందూ దేవాలయాలతో పాటు జైన ఆలయాలు కూడా నిర్మించారు. దాదాపు 85 దేవాలయాలను నిర్మించి శిల్పకళను పోషించారు. వీటిలో కాలగతిన కొన్ని శిథిలం కాగా మరికొన్ని మన దేశ శిల్పసంపద గొప్పతనాన్ని చాటేలా నభూతో నభవిష్యత్ అన్న చందాన గంభీరంగా నేటికీ నిలిచి ఉన్నాయి. అయితే ఈ దేవాలయాలను ఒకదాని నుంచి మరొకదానిని వేరు చేసి చూడడం కష్టమైన కార్యం. తూర్పు-పడమర దిశగా నిర్మితమై ఉన్న ఈ దేవాలయాలు, అంతర్గత సంబంధాలు కలిగిన లోపలివైపు గదులను కలిగిన విశాలమైన ప్రణాళికలతో చిత్రించబడ్డాయి. ఈ దేవాలయాలకు సంబంధించిన సాధారణ ప్రణాళికలో ఒక ప్రవేశ ద్వారం, ఒక సభా మందిరం, ఒక చావిడి, ఒక గర్భగుడి లాంటివి భాగాలుగా ఉన్నాయి. ఒక మహిళ లేఖ రాస్తున్నట్టు, కళ్లకు వర్ణాలు దిద్దుకుంటున్నట్టు, తలవెంట్రుకలను దువ్వుకుంటున్నట్టు, నాట్యం చేస్తున్నట్టు, తన బిడ్డతో ఆడుకుంటున్నట్టుగా మహిళకు సంబంధించిన లెక్కలేనన్ని హావభావాలు, అంశాలకు అద్దం పట్టేలా చిత్రీకరించబడిన శిల్పాలను కలిగిన ఖజురహో దేవాలయాలనేవి స్త్రీకి సంబంధించిన ఒక వేడుక లాంటివని చరిత్రలో పేర్కొన్నారు. అలాగే వీటిలో చెక్కిన తామ్రపత్రాలు, సమగ్రమైన నైపుణ్యాలతో చెక్కిన అమాయకత్వం, కామకేళిలో మహిళ ఆధిపత్యం, చిరునవ్వు, మనోహరం, మోహం,



అందం, కామకేళి శిల్పాలు క్లిష్టమైన విధానంతో చిత్రించబడ్డాయి. దీంతోపాటు లౌకికమైన వాంఛలను తీర్చుకోవడమనేది అనంతమైన స్వేచ్ఛకు మూలమైన నిర్వాణ మోక్షాన్ని సాధించేందుకు వేసే ముందడుగు అనే విశ్వాసంతో చందేలులు తాంత్రిక ఆచారాలను అనుసరించి ఉండవచ్చనే అభిప్రాయం కూడా వ్యాప్తిలో ఉంది.





## శృంగార శిల్పాలు

ఖజురహో పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే మహాద్భుత దేవాలయం 'కందరీయ మహాదేవాలయం'. దాదాపు 31 మీటర్ల ఎత్తుతో, శిల్ప సంపద ఉట్టిపడే గోపురంతో చందేల రాజుల అభిరుచికి అనుగుణంగా నిర్మించారు. ఆలయం బయట, లోపల కలిపి 800లకు పైగా అద్భుత శిల్పాలను మనం ఇక్కడ తిలకించవచ్చు. వాత్స్యాయన కామసూత్రాలకు సంబంధించిన అనేక భంగిమలు ఈ దేవాలయంపై కనిపిస్తాయి. భారతీయ సంస్కృతిలోని శృంగార తత్వాన్ని చాటిచెప్పే ఖజురహో దేవాలయాలపై శృంగార రసాధిదేవతల చిత్రాలు, శిల్పకళా సౌందర్యాన్ని చూడాలంటే రెండు కళ్లు చాలవు. ఇక్కడి శిల్పాలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. ఇవి వాత్స్యాయన కామసూత్ర గ్రంథంలోని వివిధ భంగిమలలో చెక్కబడ్డాయి. ఇంకా దేవీ దేవతల ప్రతిమలు, అప్సరసలు, స్త్రీ పురుషుల శిల్పాలు, సంగీత ఆలాపన చేస్తున్న వాద్య బృందం ఇత్యాది మనోహర శిల్పాలెన్నో మనకు కందరీయ మహాదేవ ఆలయంలో కనిపిస్తాయి. ఇక్కడ ఖాండవ్య మహాదేవ లింగం 102 అడుగుల పొడవు, 66 అడుగుల వెడల్పు, 109 అడుగుల ఎత్తు కలిగి మహాద్భుతంగా కనిపిస్తుంది. కందరీయ మహా దేవాలయంలో విస్తారంగా కనిపించే అలంకృత శిల్పకళను భారతదేశానికి సంబంధించిన అత్యద్భుత కళాఖండాల్లో ఒకటిగా పరిగణిస్తున్నారు. చందేల రాజవంశం ద్వారా నిర్మితమైన ఈ దేవాలయాలపై మనసును వశపర్చుకునేలా కనిపించే స్పష్టమైన కామకేళి ప్రదర్శిత శిల్పకళ అనేది ప్రేమను

**(మిగతా 24వ పేజీలో)**





కథ

# కాకి సాయం

పూర్వం ఉదయగిరి సంస్థానాన్ని ఉదయశంకర్ పరిపాలించేవాడు. అతని పాలనలో హఠాత్తుగా వర్షాకాలంలో పెద్ద తుపాన్ వచ్చింది. ఒక్కసారిగా వారం రోజులు ఎడతెరిపిలేని వర్షం కురవడంతో రాజ్యంలో ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. పెద్దపెద్ద భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. ఉదయగిరి అతలాకుతలమైంది. రాజభవనంలో రాణితో సహా చెల్లాచెదురై వరదనీటిలో కొట్టుకుపోయి జాడ లేకుండా పోయారు. ఉదయశంకర్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. వరద నీటికి భయపడి పాత సున్నంరాళ్లతో నిర్మించిన మిద్దె చివరన నాలుగో అంతస్థులో వున్న రాజు కాళ్లు కదిలించకుండా అక్కడే దిగులుగా కూర్చున్నాడు. అప్పటికే వారం రోజులైంది. తిండిలేదు. ఎటు చూసినా నీటిప్రవాహమే కనిపించింది. ఎవరైనా కనిపిస్తే రక్షణ కోరదామనుకున్నా మనిషి సంచారం లేదు. రాజు ఒక్కడే ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాడు. సరిగ్గా అదే సమయానికి రాజ భవనంపై అంతస్థుపై కూర్చొని 'కా.. కా..' అని బిగ్గరగా అరవసాగింది ఓ కాకి.

ఆ కాకిని చూశాడు రాజు. వెంటనే కాకి వద్దకు వెళ్లాడు... "కాకీ.. కాకీ.. నీకు శతకోటి వందనాలు. వర్షం కారణంగా నాకు ఆహారం దొరకలేదు. వున్న చోటు నుంచి కదలలేకపోతున్నాను. వారం రోజుల నుంచి ఆకలితో అలమటిస్తున్నాను. ఏదయినా ఆహారం తెచ్చిస్తే నీకు మంచి మేలు చేస్తాను" అని చేతులెత్తి వేడుకున్నాడు.

కాకి రాజు మొరను ఆలకించింది. రివ్వున గాల్లోకి ఎగిరింది. ఆ ఊరు చివరలో ఓ పెద్ద చెరువు వుంది. ఆ చెరువులో ఓ వృద్ధుడు నాటు పడవలో చేపలు పట్టుకుంటున్నాడు. కాకి అతని వద్దకు వెళ్లి పడవ మీద వాలింది. ఆ వృద్ధుడు తినడానికి దాచుకున్న చద్దన్నం, నిమ్మకాయ ఊరగాయను చూసింది. "అయ్యా... అయ్యా.. వారం రోజులుగా పస్తులుంటున్నాను. ఈ చద్దన్నం ఇవ్వు. వీటితో పాటు ఏదయినా నీకు మంచి సాయం చేస్తాను" అని దీనం వేడుకొంది.

ఆ వృద్ధుడికి కాకి మీద కోపం వచ్చినా అది ప్రాధేయపడుతూ అడగడంతో కాస్త జాలి చూపాడు.

"సరేలే.. వారం రోజులుగా నాకు ఓ చేపముక్క కూడా దొరకలేదు. ఈ రోజైనా నాలుగు చేపలు తీసుకెళ్లకుంటే ఇంట్లోకి రానివ్వరు. ఏదైనా సాయం చేసి నాలుగు చేపలు పట్టుకురా. అప్పుడు ఈ చద్దన్నం పట్టుకెళ్లవులే" అన్నాడు.

కాకి చెరువులో కొంత దూరం ఎగురుతూ వెళ్లింది. ఎగిరెగిరి పడుతున్న పెద్ద పెద్ద చేపలు నాలుగు ముక్కుతో పట్టుకుని వృద్ధుడి వద్దకు వచ్చింది. ఆ వృద్ధుడు ఆనందంతో తను తెచ్చుకున్న చద్దన్నంమూటను కాకికి ఇచ్చి చేపలతో ఇంటికి బయలుదేరాడు.

కాకి "నీ సాయం మరువలేను. త్వరలో నీకు మంచి కానుక ఇస్తాను" అని చెప్పి చద్దన్నంమూటను నోట పట్టుకుని రాజభవనాన్ని సమీపించింది వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న ఉదయశంకర్‌కి కాకి కనిపించడంతో ఆశ చిగురించింది. కాకి తెచ్చిన చద్దన్నం మూటను విప్పి తృప్తిగా తిన్నాడు. ఓరోజు ఉదయశంకర్ రాజభవనం మీద కూర్చుని వుండగా తనకు సాయం చేసిన కాకి కనిపించింది. వెంటనే రాజు కాకి వద్దకు వెళ్లి "బాగున్నావా?" అని కుశల ప్రశ్నలు వేశాడు. తన దగ్గరున్న బంగారు ఆభరణాన్ని కానుకగా ఇచ్చాడు. కాకి సంభ్రమాశ్చర్యానికి గురై రాజు దయా గుణాన్ని కాదనలేక హారాన్ని తీసుకుని రాజుకు సెలవు చెప్పి చేపలు పడుతున్న వృద్ధుడి వద్దకు నడిచింది. "ఇదిగో ఆ రోజు నువ్విచ్చిన చద్దన్నం తీసుకెళ్లి వరదనీటిలో చిక్కుకున్న ఉదయగిరి రాజు ఉదయశంకర్‌కు ఇచ్చి ఆకలిని తీర్చాను" అని వివరించింది కాకి. ఆ వృద్ధుడు ఆశ్చర్యపోయి బంగారు హారాన్ని తీసుకుని ఓ దుకాణంలో అమ్మాడు. వచ్చిన డబ్బుతో హాయిగా కాలం గడిపాడు. కాకిని తన వద్దే ఉంచుకుని రోజూ మంచి ఆహారం పెట్టి పోషించాడు.


- బోగా పురుషోత్తం








వార్త ఆదివారం



## బాలగేయం

### బడి పేరు నిలబెడతాం



పిల్లలం
మేం బడి పిల్లలం
శ్రద్ధగా చదువుకునే
మంచి పిల్లలం
పెద్దల మాటల్ని
గౌరవిస్తాం
క్రమశిక్షణతో
నడచుకుంటాం
అమ్మా నాన్నలను
ప్రేమిస్తాం
గురువుల మాటకు
విలువిస్తాం
అందరికీ ఆదర్శంగా
నిలుస్తాం
బడిపేరును నిలబెడతాం

**- వైదా ఈశ్వరరావు,**
విశాఖపట్నం



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.కార్తిక్,** విజయవాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. బిపివో అంటే ఏమిటి?**

**జవాబు: కార్తిక్!** మన దేశ ఐటీ రంగంలో 2002లో మరో కొత్త ఆధ్యాయం ప్రారంభమైంది. అప్పటివరకూ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్‌కే ప్రాధాన్యం ఇచ్చిన కంపెనీలు బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్(బీపీవో) వైపు దృష్టి సారించాయి. బీపీవో వలన మనకు ఏటా కోట్ల డాలర్ల ఆదాయం లభించడమే కాకుండా లక్షలాది మందికి ఉపాధి దొరుకుతోంది. సాధారణంగా కంపెనీలు వ్యాపార నిర్వహణతో పాటు ఉద్యోగుల వేతనాలు నెలవారీ సిద్ధం చేయడం, కంపెనీ తాలుకు అకౌంట్లను నిర్వహిస్తుంటాయి. అయితే ఈ పనుల వల్ల ప్రధానమైన వ్యాపారంపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించడం సాధ్యం కాదని భావిస్తున్నారు. ఇటువంటి అప్రధానమైన కార్యక్రమాలను ఇతర కంపెనీలకు అందించడాన్నే అవుట్‌సోర్సింగ్ అంటారు. ఉదా: 'ఎ' అనే కంపెనీని తీసుకుందాం. ఈ కంపెనీ ప్రధానంగా కార్ల తయారీ వ్యాపారంలో ఉందని అనుకుందాం. ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులు ఇందులో పని చేస్తున్నారు. వీరందరి పే స్లిప్‌లను తయారు చేయడం కంపెనీకి అప్రధానం అవుతుంది. మొత్తం ఉద్యోగుల డేటాబేస్‌ను 'బి' అనే కంపెనీకి పంపి పే స్లిప్‌లను తయారు చేయమని 'అవుట్ సోర్సింగ్' చేయవచ్చు. ఫలితంగా కంపెనీ ఇతర ముఖ్యమైన వ్యాపారాల మీద దృష్టి కేంద్రీకరించేందుకు వీలు చిక్కుతుంది.

**- బి.మధుప్రియ,** శ్రీకాకుళం

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. క్రికెట్‌లో అంపైర్ల ప్రధాన బాధ్యత ఏమిటి?**

**జవాబు: మధుప్రియ!** రిఫరీ, ఆర్బిటర్, అంపైర్.. వీరందరూ ఒకే రకమైన బాధ్యత కలిగివుంటారు. ఎలాంటి భావోద్వేగాలకు లోనుకాకుండా నిబంధనలకు అనుగుణంగా, నిష్పక్షపాతంగా, రాగద్వేషాలకు అతీతంగా ఆటను నిర్వహించడం వీరి బాధ్యత. క్రీడలననుసరించి ఈ పేరు మారుతుంటుంది.







# బహుళ ప్రయోజనకారి డిటాక్స్ వాటర్

**నీళ్లను** మించిన ఆరోగ్యప్రదాయని మరొకటి లేదు. ఇది వాస్తవం. నీళ్ల తాగడం వల్ల జీవక్రియ రేటు పెరుగుతుంది. అందుకే రోజుకి కనీసం ఎనిమిది గ్లాసుల నీళ్ల తాగాలని అంటారు. జీర్ణక్రియకు, రక్తప్రసరణకు తోడ్పడడమే కాకుండా భోజనం మధ్య విరామం ఉండేలా చేసేవి మంచినీళ్ల. అయితే సాధారణ నీళ్లలో సువాసన, రుచి, ఆరోగ్యం కోసం వివిధ పదార్థాలను కలపడాన్నే 'ఇన్‌ఫ్యూజ్డ్'గా పిలుస్తున్నారు. దీనినే అందరికీ అర్థమయ్యేలా 'డిటాక్స్ వాటర్' అంటున్నారు.



ఎలాంటి తీపి, కృత్రిమ పదార్థాలు లేకుండా సహజమైన పళ్లు, కూరగాయలు, మూలికలు వేసి రూపొందించే నీళ్లనే డిటాక్స్ వాటర్ అంటారు. జ్యూస్‌లు, స్మూతీల్లా మిక్సీలో తిప్పడం, బ్లెండ్ చేయడం లాంటివి ఇందులో లేవు. ఈ చిన్న ప్రయోగమే ఆ నీటిని ఆరోగ్యానికి విశేషంగా తోడ్పడే నిధిగా మారుస్తోంది. ఇప్పుడు ఎందరో సెలబ్రిటీలు తమ సౌందర్య మంత్రంగా ఈ డిటాక్స్ వాటర్‌నే పేర్కొంటు న్నారు. పైగా ఈ నీళ్లను తాగడం వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అందుకే యువత ఎక్కువగా ఫాలో అవుతోంది. అంతేకాకుండా బరువు తగ్గడానికి డిటాక్స్ నీళ్ల ఓ చక్కని సాధనం.

**ఎంతో సులభం**

డిటాక్స్ నీళ్లంటే ఏమిటో, ఎలా తయారు చేయాలో అన్న భయం లేదు. ఇంట్లోనే వివిధ రకాల డిటాక్స్ నీళ్లను తయారు చేసుకోవచ్చు. దీనికి నీళ్లతో పాటు కూరగాయలు, తాజా పండ్లు, మూలికలు అవసరం. అభిరుచికి తగినట్లుగా వివిధ పదార్థాలను చేర్చి ఈ ప్రత్యేక నీళ్లను తయారు చేయవచ్చు. ఈ నీళ్ల వేడిగా లేదా చల్లగానైనా ఉండవచ్చు. పండ్లు లేదా కూరగాయల ముక్కలను ఓ సీసా నీళ్లలో వేసి 1-12 గంటల వరకు నానబెట్టాలి. ఆ తరువాత వడకట్టి ఫ్రిజ్‌లో పెట్టుకుని తాగవచ్చు.

ట్రెండుకు తగినట్లుగా నీటిసీసా మధ్యలో కూరగాయలు, పండ్లు వేసే అరను ప్రత్యేకంగా రూపొందించిన 'డిటాక్స్ వాటర్ బాటిల్స్' మార్కెట్‌లో లభిస్తాయి. వేడినీళ్లలో ఈ ముక్కలను ఉడికించి వడకట్టి తాగడం మరో పద్ధతి. ఈ రెండు పద్ధతుల్లోనూ పండ్లు, కూరగాయలు, మూలికలు కలిసిపోయి ఆ నీళ్ల రూపురేఖల్ని మార్చేస్తాయి. ఈ నీటిలో ఔషధ గుణాలు ఎక్కువ, రుచిగా ఉంటాయి. ఈ నీళ్లలో కేలరీలు అస్సలు ఉండవు. కనుక బరువు తగ్గాలనుకునేవారికి మంచి ఛాయిస్‌గా మారుతున్నాయి. తొందరగా డిటాక్స్ వాటర్ తయారు చేయాలని అనుకునేవారు ముక్కలను క్రష్ చేసి నీళ్లలో వేయవచ్చు.

డిటాక్స్ నీళ్లకోసం ఉపయోగించాల్సిన పండ్లు, కూరగాయలు:

కూరగాయలు: కీరా దోసకాయ, మామిడి, చింత.

బెర్రీస్: స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, చెర్రీలు.

పుచ్చకాయ, కర్బూజా, ఆపిల్స్, పియర్స్, ద్రాక్ష, రేగి.

నిమ్మ, నారింజ, కివీ.

సుగంధ ద్రవ్యాలు: దాల్చినచెక్క, అల్లం, యాలకులు, జీలకర్ర, మిరియాలు.

పుదీనా, తులసి, కొత్తిమీర.

నారింజ-పుదీనా నీళ్లు:



నారింజలో విటమిన్‌లు పుష్కలంగా ఉంటాయి. ప్రమాదకరమైన ఫ్రీ రాడికల్స్ నుంచి శరీరానికి రక్షణ కలిగిస్తుంది. స్వస్థత చేకూరుస్తుంది. చర్మం మెరిసేలా చేస్తుంది. పుదీనా తాజాదనాన్ని కలిగిస్తుంది.



ఆపిల్-దాల్చినచెక్క:
ఈ కాంబినేషన్ నీళ్ల జీవక్రియ వేగాన్ని పెంపొందిస్తాయి. విటమిన్-సి, బీ కాంప్లెక్స్‌తో పాటు ఆపిల్‌లో ఫ్లేవనాయిడ్స్ ఎక్కువ. అందుకే గుండె సమస్యలను, మధుమేహాన్ని తగ్గిస్తాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి దాల్చిన చెక్క ఉపయోగపడుతుంది. కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

### అల్లం-నిమ్మ:

బెల్లీ ఫ్యాట్‌ను తగ్గించేందుకు ఈ నీళ్ల ఉపయోగపడతాయి. అల్లంతో చేసిన ద్రవాలను సేవించడం వల్ల ఆకలి తొందరగా వేయదు. కాస్త తినగానే కడుపు నిండినట్టుగా అనిపిస్తుంది. కనుక బరువు తగ్గాలనుకునేవారు ఈ నీళ్ల ఎంతో ఉపయోగపడతాయి. దీంతో పాటు నిమ్మ శరీరం నుంచి వ్యర్థాలను తొలగించేందుకు సహాయం చేస్తుంది.



### స్ట్రాబెర్రీ

ఇందులో విటమిన్ 'సి' పుష్కలంగా ఉంటుంది. వీటిని చిన్న ముక్కలుగా చేసి, నానబెట్టి వడకట్టిన స్ట్రాబెర్రీ డిటాక్స్ వాటర్‌ను సీసాలో నింపుకుని నీటిపైన కాస్త పుదీనా ఆకులు వేస్తే అద్భుతమైన సువాసనతో తాజాదనాన్ని కలిగిస్తుంది.

### పుచ్చకాయ

హైడ్రేటింగ్ ఏజెంట్. శరీరంలోని మలినాలను తొలగించే సిట్రులిన్ అనే అమైనో ఆమ్లం ఇందులో ఉంటుంది. ఈ ఆమ్లం కిడ్నీలు, కాలేయం అమ్మోనియాను తొలగించడానికి దోహదపడుతుంది. కండరాల వాపులను కూడా పుచ్చకాయ తగ్గిస్తుంది.

### కీరాదోస:

ఇందులో ఉన్న మాంగనీస్ శరీర కణాల పనితీరును మెరుగుపరచి అంతర్గత అవయవాలకు మంచి చేస్తుంది. శక్తిస్థాయినీ పెంచుతుంది.

### ఎలా తయారు చేయాలి?

డిటాక్స్ వాటర్‌ను చాలా సులభంగా తయారు చేసుకోవచ్చు. అన్ని వస్తువులూ వంటింట్లో లభిస్తాయి.

కాలేయ ఆరోగ్యం
కావాల్సిన పదార్థాలు: ఒక లీటరు నీళ్లు; రెండు స్పూన్ల పసుపు జ్యూస్; నాలుగు నిమ్మబద్దలు.

**తయారు చేసే విధానం:**
వీటన్నింటినీ ఒక సీసాలో వేసి, రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టాలి. ఆ మరుసటి రోజు ఆ నీటిని వడగట్టి తాగాలి. కాలేయం ఓ ఫ్యాక్టరీ లాంటిది. నిరంతరం జీవక్రియలో నిమగ్నమై ఉంటుంది. కాలేయం సహజసిద్ధంగా, మరింత మెరుగ్గా మలినాలను తొలగించేందుకు ఈ జ్యూస్ ఉపయోగపడుతుంది.

### జాతాగా ఉండేందుకు..

కావాల్సిన పదార్థాలు: అర కప్పు కీరాముక్కలు; ఒక నిమ్మకాయ; కొన్ని పుదీనాఆకులు; ఒక లీటరు నీళ్లు.

**తయారు చేసే విధానం**
కీరా, నిమ్మకాయ ముక్కలు, పుదీనాను ఓ జగ్గులో వేసి అందులో లీటర్ నీళ్ల పోసి రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టాలి. మరుసటి రోజు ఆ నీళ్లను కొద్దికొద్దిగా తాగాలి. ఈ జ్యూస్‌లో విటమిన్ సి, విటమిన్ ఎ ఎక్కువగా ఉండి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. అంతర్గతంగానే కాకుండా బయటికి కూడా మనల్ని తాజాగా ఉంచుతుంది.

### గ్రీన్ వాటర్



**కావాల్సిన పదార్థాలు:**
పావుకప్పు నిమ్మరసం; రెండు స్పూన్ల అల్లంముక్కలు; మూడు రెమ్మల పుదీనా ఆకులు; అర కప్పు కీరా ముక్కలు; మూడు కప్పుల ఐస్‌ముక్కలు; ఒక లీటరు నీళ్లు.

**తయారు చేసే పద్ధతి:**
మూత ఉన్న పెద్ద జారులో పుదీనా ఆకులు, కీరదోసకాయ ముక్కలు వేయాలి. ఇందులోనే రెండు ఐస్‌ముక్కలు, నిమ్మరసం, నీళ్ల బాగా కలిపి పది నిమిషాల తరువాత తాగాలి.



### హాట్ అండ్ స్టోర్

**కావాల్సిన పదార్థాలు:**
నాలుగు స్పూన్ల నిమ్మరసం; అర స్పూను మిరియాల పొడి; రెండు కప్పుల ఐస్‌ముక్కలు; ఒక లీటరునీళ్లు.

**తయారు చేసే పద్ధతి:**
జార్‌లో రెండు కప్పులు ఐస్‌ముక్కలు వేసి దాంట్లో నిమ్మరసం, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చాలా ఏళ్లుగా ఎంతో మంది వాడుతున్న విషయం తెలిసిందే. ఈ నీటి వల్ల మలినాల తొలగింపు, కడుపునొప్పి నివారణ, జీవక్రియ, రక్తప్రసరణ మెరుగవుతుంది.

### శక్తి అధికం..

మానవ శరీరంలో కాలేయం, కిడ్నీలు రోజూ మలినాలను శుభ్రపరచే పనిలోనే ఉంటాయి. నీటిని మించిన దివ్యౌషధం లేదన్నది అందరికీ తెలిసిన విషయం. కనుక ప్రత్యేకంగా డిటాక్స్ నీళ్ల ఎందుకు? అనే సందేహం రావచ్చు. గోలీ సోడా, మాక్‌టైల్స్, కూల్‌డ్రింక్స్ వీటితో పోలిస్తే డిటాక్స్ వాటర్ చాలా మేలు చేస్తుంది. ఇందులో ప్రిజర్వేటివ్స్, ఆర్టిఫిషియల్ స్వీట్‌నర్స్ లాంటివి ఉండవు. అందుకే సాధారణ నీళ్లతో పాటు వీటిని తాగడం వల్ల శరీరానికి ఆరోగ్యకరమైన రీతిలో పోషకాలను అందించినట్లవుతుంది. అలాగే కిడ్నీ, కాలేయం, కోలిన్ రోజువారీ కార్యకలాపాలకు తోడ్పాటు చేకూరుతుంది. ఔషధ గుణాలున్న సహజమైన పండ్లు, కూరగాయలు కావడం వల్ల అన్ని నరాలుగా శరీరానికి తోడ్పడతాయి. అయితే శరీరానికి సరిపడే, నచ్చినవాటితోనే ఈ నీళ్లను చేసుకోవడం మంచిది. అలాగే మంచినీళ్లను కాకుండా డిటాక్స్ వాటర్‌నే ఎక్కువ తీసుకోవడం అంత శ్రేయస్కరం కాదు. ఈ నీళ్లను

కథ

# ప్రేమ ప్రస్ఫుటం

దేవీ ప్రసాద్ ఒబ్బు

తనకి, నాకు మధ్య వివాహ బంధం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచాయి. ఎప్పుడూ మా మధ్య మనస్పర్థలు వచ్చింది లేదు. కానీ, కొంత కాలంగా ఆమె ప్రవర్తన అసాధారణంగా ఉంది. ఆమె ఎందుకు అలా మారిపోయిందో ఎంత ఆలోచించినా అంతు చిక్కడం లేదు. ఇదే విషయాన్ని ఆమెను పలుమార్లు అడిగినా సరైన సమాధానం చెప్పక మౌనంగా ఉండిపోతోంది. నా వైపు నుంచి పొరబాటు ఏమైనా జరిగిందా అని నాలో నేనే అవలోకనం చేసుకున్నా నాకు ఏ కారణం కనిపించడం లేదు. మరి.. ఆమె నా పట్ల ఎందుకు విముఖత చూపుతుందో అవగతం కావడం లేదు.



నా కళ్లల్లో చూసి మాట్లాడేది కాదు. ఇప్పుడు నా వైపు చూడకుండానే మాట్లాడుతోంది.

నా ముందు కూర్చుని ప్రేమగా కొసరి, కొసరి వడ్డిచ్చేది. ఇప్పుడు నన్నే వడ్డించుకుని తినమంటోంది.

గుమ్మం దగ్గర నాకు ఎదురొచ్చి టాటా చెప్పేది ఆఫీసుకు వెళ్లేటప్పుడు.

ఇప్పుడు అసలు ఇంట్లో నుంచే బయటకు రావడం లేదు.

సినిమాలకు, పార్కులకు తీసుకెళ్లమని నన్ను బతిమాలేది.

ఇప్పుడు నేనే రమ్మని పిలిచినా నా వైపు కోపంగా చూస్తోంది.

నా బట్టలను శుభ్రంగా ఉతికి చక్కగా మడత పెట్టేది.

ఇప్పుడు మడత పెట్టకనే చిందరవందరగా పారేస్తోంది.

నేను పని చేసేది పోస్టాఫీసులో అయినా కథలు రాయడం నా హాబీ. నేను కథ రాసిన తర్వాత మొదటి శ్రోత తనే. నేను రాసిన కథలను శ్రద్ధగా చదివి అందులోని లోటుపాట్లను చెప్పేది. అంతేకాకుండా నేను కథా రచన చేసే సమయంలో నాకు రిలీఫ్‌గా ఉండేందుకు కాఫీ, టీలు అందించేది.

ఇప్పుడు అసలు నేను కథలు రాస్తున్నానా? లేదా? అనే విషయాన్ని కూడా పట్టించుకోవడం లేదు.

నేను ఆఫీసులో ఉండేటప్పుడు రోజుకు రెండు, మూడు సార్లు ఫోన్ చేసి మాట్లాడేది. ఇప్పుడు అసలు ఫోనే చేయడం లేదు. ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు తనకెంతో ఇష్టమైన పాలకోవా, హాట్ చిప్స్, డెయిరీ మిల్క్ చాక్లెట్స్ తెచ్చివ్వమని అప్పుడప్పుడు అడిగేది.

ఇప్పుడు అవి తెచ్చినా వాటిని ముట్టుకోవడం లేదు. సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన తర్వాత నాకు ఇష్టమైన స్నాక్స్ ఏం కావాలో అడిగి చేసి పెట్టేది.

ఇంటికి రాగానే ఇప్పుడు మంచినీళ్లు కూడా ఇవ్వడంలేదు.

వేరే ఊళ్లకు వెళ్లడానికి బస్సు లో ప్రయాణం చేసేటప్పుడు నా పక్కన కూర్చుని సెల్ఫీ తీసుకొనేది.

ప్రయాణం చేసినంతసేపు తన చిన్ననాటి సంగతులు, వాళ్ల ఫ్రెండ్స్ విషయాలు నాతో సంతోషంగా పంచుకునేది.

ఇప్పుడు అసలు నా పక్కన కూర్చోవడానికే ఇష్టపడక వేరే సీటులో కూర్చుంటోంది.

వాట్సప్, ఫేస్‌బుక్‌లలో ప్రొఫైల్ పిక్చర్‌గా మేమిద్దరం ఉండే ఫొటో పెట్టుకునేది.

ఇప్పుడు తన ఫొటో ఒక్కటే పెట్టుకుంటోంది. ఏదైనా పెళ్లిళ్లకు, పుట్టినరోజు కార్యక్రమాలకు వెళ్లినప్పుడు నాతో కలసి భోజనం చేసేది.

ఇప్పుడు నాకు దూరంగా కూర్చుని తింటోంది.

ఫంక్షన్లలో బంధువులతోగానీ, మిత్రులతోగానీ ఫొటోలు దిగేటప్పుడు నేను పక్కననిలబడనిదే ఫొటో తీసుకునేది కాదు. ఇప్పుడు నన్ను పిలవకనే తనే వెళ్లి ఒంటరిగా ఫొటోలు తీసుకుంటోంది.

ఏదైనా షాపింగ్ వెళ్లినప్పుడు తను సెలెక్ట్ చేసుకున్న ప్రతి చీరలనుగానీ, చుడీదార్లనుగానీ నాకు నచ్చితేనే తీసుకునేది. అదే సమయంలో నా బట్టలను తనే సెలెక్టు చేసి ఇచ్చేది.

ఇప్పుడు నన్ను సంప్రదించకుండానే తనే సెలెక్టు చేసుకుంటోంది. నా బట్టలను నన్నే సెలెక్టు చేసుకోమంటోంది.

నేను స్నానానికి వెళ్లిన ప్రతిసారి టవలు అందించడం దగ్గర నుంచి ఆరోజు నేను ఏ దుస్తులు వేసుకోవాలో తనే సిద్ధం చేసి ఉంచేది.

అంతేకాకుండా వారానికొకసారి తలంటి స్నానం చేపించేది.

కానీ ఇప్పుడు నేను స్నానం చేసానా? లేదా? అనే తలంపు కూడా తనకు లేనట్లు ప్రవర్తిస్తోంది.

ఏదైనా పనిమీద గానీ, ఫంక్షన్లకిగానీ వేరే ఊళ్లకి నేను వెళ్లినప్పుడు రాత్రుల్లో తను ఒంటరిగా ఉండలేక బోర్‌గా ఫీలయ్యేది.

ఇప్పుడు నా పక్కన పడుకోవడానికే ఇష్టపడక తను ఒక్కతే ఒంటరిగా నేలపై సాప వేసుకుని పడుకుంటోంది.
"ఎందుకలా చేస్తున్నావు?" అని అడిగితే–
"నాకు కింద పడుకోవడమే కంఫర్ట్‌గా ఉంటుంది. అంతకుమించి నన్నేమీ అడగొద్దండి" అని చెబుతోంది.
దాంతో నేను, తనను డిస్ట్రబ్ చేయడం ఇష్టంలేక మౌనంగా ఉండిపోతున్నాను. అందుకే నాకు రాత్రులలో నిద్ర పట్టడం లేదు. రెండు, మూడు గంటల ప్రాంతంలో మెలకువ వచ్చేస్తోంది. ఒక్కోసారి నడిరేయికే మెలకువ వస్తోంది. మెలకువ వచ్చిన తర్వాత మళ్లీ నిద్ర పట్టదు.
ఆ సమయంలో ఆమెను నిద్ర లేపి "నీవు ఎందుకు అలా ఉన్నావు?" అని అడగాలని అనిపిస్తుంది. కానీ "ఈ టైంలో కూడా నన్ను ప్రశాంతంగా ఉండనివ్వవా?" అని అంటుందేమోనని భయం. అందుకే నిద్ర లేచిన ప్రతిసారీ ఆమె వైపు చూసి మళ్లీ పడుకుంటాను. కానీ నిద్ర రాదు. ఆమె గురించిన ఆలోచనలతోనే అటూ, ఇటూ దొర్లుతూనే ఉంటాను అసౌకర్యంగా. గత ఆరు మాసాలుగా ఇదే వ్యవహారం నడుస్తోంది ఇంట్లో.

...

ఓ రోజు ఉదయం స్నానం చేసి బాత్రూం నుంచి బయటకు రాగానే నా ఫోను తన చేతిలో కనిపించడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే, తన ఫోనుని నేనుగానీ, నా ఫోనుని తనుగానీ ఎప్పుడూ తాకింది లేదు. నాకు వచ్చే కాల్స్ తను ఎప్పుడూ లిఫ్ట్ చేయదు. అలాగే తనకి వచ్చే కాల్స్‌ని కూడా నేను లిఫ్ట్ చేయను. మరి ఇవాళ నా ఫోను తన చేతిలో ఎందుకు ఉందో నాకు అర్థంకాలేదు.
"ఫోను ఎందుకు ఎత్తుకున్నావు?" అని అడిగితే తను ఎక్కడ బాధ పడుతుందేమోనని "ఫోనుకి ఏమైంది?" అన్నాను.
"మీరు చార్జింగ్ పెట్టేటప్పుడు ఫోనుని స్టాండ్‌పై సరిగా పెట్టలేదేమో! ఫోను కింద పడుంది. దాన్ని సరిగా పెడదామని తీసుకున్నానండి" అని చెప్పడంతో తర్వాత నేనేమీ మాట్లాడకుండా డ్రస్ మార్చుకోవడానికి బెడ్రూంలోకి వెళ్లాను. కానీ కొన్ని రోజుల తర్వాత నేను స్నానానికి వెళ్లి వచ్చినప్పుడుగానీ, ఏదో పని మీద నా రూంలో నుంచి హాలులోకి వచ్చినప్పుడుగానీ తను నా ఫోనుని పరిశీలిస్తుండడం; నేను రూంలోకి వచ్చే అలికిడి విని కంగారుపడి ఫోనుని అక్కడ పెట్టేసి తాను హడావుడిగా అక్కడి నుంచి వెళ్లడం ఒకటి, రెండు సార్లు నేను గమనించాను. అంటే, తను నన్ను అనుమానిస్తోందా? ఆ కారణం చేతనే నా పట్ల విముఖత చూపుతోందా? అయినా తను అనుమానించతగ్గ పనులేవీ నేను చేయలేదే. ఛీ..ఛీ.. తను నన్ను ఎప్పుడూ అనుమానించదు. నేనేమిటో తనకు తెలుసు. తను ఏమిటో నాకు తెలుసు. మరెందుకు నా ఫోనుని పలుమార్లు నాకు తెలియకుండా చూస్తోంది. ఈ విషయాన్ని ఇక ఉపేక్షిస్తే లాభంలేదు. ఎన్ని రోజులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకోకుండా ఎడమొహం, పెడమొహంతో మేం బతకాలి. విషయమేమిటో తన దగ్గరే అమీ తుమీ తేల్చుకుందామని నిర్ణయానికొచ్చాను.

....

ఓ రోజు తన వంటింట్లో ఉండగా దగ్గరకు వెళ్లి "నాకు తెలియకుండా నా ఫోను ఎందుకు చూస్తున్నావు?" అన్నాను.
తన నుంచి సమాధానం రాలేదు. మళ్లీ అదే ప్రశ్న వేశాను.
ఈసారి వంటింట్లో నుంచి వచ్చి హాలులో ఉన్న సోఫాలో మౌనంగా కూర్చుంది.
"ఏదైనా చెప్తేనే కదా తెలుస్తుంది. మనసులో ఏదో పెట్టుకుని సాధిస్తే ఎలా?" కాస్త లాలనగా అన్నాను.
"నేను ఎవరినీ సాధించడం లేదు. మీరే నన్ను విస్మరించారు" అంది.
ఆ మాట నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.
"నేనా! నేనేం చేశాను?"
"చేసిందంతా చేసి ఏం తెలియనట్లు నటిస్తున్నారు మీరు"
"నేను నటించడం ఏంటి? నాకేం అర్థంకాలేదు. డొంకతిరుగుడు మాటలెందుకు? ఏదైనా చెప్పదలచుకున్నది సూటిగా చెప్పు" కటువుగా అన్నాను.

"ఏదైనా చెప్తేనే కదా తెలుస్తుంది. మనసులో ఏదో పెట్టుకుని సాధిస్తే ఎలా?" కాస్త లాలనగా అన్నాను. "నేను ఎవరినీ సాధించడం లేదు. మీరే నన్ను విస్మరించారు" అంది.

"మరీ.. ఈ ఫోనులో 'మై హార్ట్' అని సేవ్ చేసుకుని ఉన్న ఆ అమ్మాయి ఎవరు? తనతో నీవు తరచూ మాట్లాడడం నన్ను విస్మరించడం కాదా?" కోపంగా అంది.
ఆ మాటతో నాలో నవ్వు, జాలి ఏక కాలంలో కలిగాయి.
అందుకే తన వైపు జాలిగా చూసి "ఆ నంబరు ఎవరిది అనుకుంటున్నావు నీవు?" అన్నాను.
"నాకెలా తెలుస్తుంది? ఫోను చేసేది నీవేగా. నీకే తెలియాలి" ఎత్తిపొడుపుగా అంది.
"సరే.. ఇదిగో ఆ పేరుండే నంబరుకి నీవు ఫోను చేయ్" అని ఫోనులోని ఆ పేరు ఓపెన్ చేసి ఫోను తన చేతికిచ్చాను.
తను ఫోను తన చేతిలోకి తీసుకోగానే ఆత్రుతగా ఆ నంబరుకి కాల్ చేసింది.
అంతే! హాల్లో టీపాయ్ మీద ఉన్న తన ఫోను రింగైంది. వెళ్లి తన ఫోను తీసుకుని లిఫ్ట్ చేసి హాలో అనగానే తన వాయిస్ తనకే వినబడింది.
"ఇదేంటి? నా వాయిస్ నాకే వినిపిస్తుంది.
అంటే ఇది ఇది నా నంబరా?" అని నా వైపు ఆశ్చర్యంగా చూసింది.
"ముమ్మాటికీ నీ నంబరే"

**రచనలకు ఆహ్వానం**
రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరే వారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

"నేను ఆ అమ్మాయిదేమో అనుకున్నానండి" అంది.
"ఏ అమ్మాయిది?" అన్నాను ఆశ్చర్యంగా.
"అదేనండి.. ఆరు మాసాల క్రితం ఫారిన్ నుంచి 'మైథిలీ' అనే అమ్మాయి రాత్రి పదకొండు గంటలకు ఫోన్ చేసి మీతో మాట్లాడిందే మీ క్లాస్‌మేట్... ఆ అమ్మాయి అనుకున్నాను" అంది.
"ఓస్.. నీ వెంకమ్మా, అదా నీ అనుమానం. ఆ అమ్మాయి ఆరోజు ఫోన్ చేసింది అంతే.. తర్వాత ఎప్పుడూ కాల్ చేయలేదు. ఆ అమ్మాయి ఎవరిదో నంబరు కావాలని అడిగింది. నేను ఆ నంబరు ఇచ్చాను. ఈ విషయాలన్నీ నీవు కూడా విన్నావు కదా. అయినా నీకు ఎందుకొచ్చింది ఈ అనుమానం?" అని నేను చెప్పినా తన మొహంలో అనుమాన ఛాయలు ఇంకా తొలగలేదు.
"మరి ఫోనులో 'మై హార్ట్' అని పేరు ఎందుకు పెట్టుకున్నావు?" అంది.
"నీ పేరుని నెలకొకటి మారుస్తుంటాను నీ మీద ప్రేమతో. డార్లింగ్ అని, బ్యూటీ అని, వండర్ఫుల్ అని, మై హార్ట్ అని ఇలాగ. నీవు నా ఫోను చూడవు కాబట్టి నీకు తెలియదు. ఇప్పుడు నీకు నా మీద అనుమానం కలిగి చూశావు. అది ఎవరిదో అనుకుని అనుమానం పెంచుకుని నన్ను అపార్థం చేసుకున్నావు. పర్యవసానంగా నాకు నరకం చూపించావు" అని అంటుంటే తన మొహంలో చిరునవ్వు చిగురించడం నా కళ్లు పసిగడుతూనే ఉన్నాయి. "సారీ అండి. మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నాను. నన్ను క్షమించండి" అని నా కళ్లల్లోకి చూసింది. ఇప్పుడు తన కళ్లల్లో నాపై ప్రేమ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ❑

---

**ఔషధాలకూ కల్తీకాటు..**

**(11వ పేజీ తరువాయి)**

కొవిడ్ సంక్షోభం సమయంలో భారతదేశం లో కృత్రిమ ఔషధాల కొరత ఏర్పడింది. ఈ పరిస్థితులను ఆసరాగా తీసుకుని అనేక నకిలీ మందులు జనబాహుళ్యంలోకి ప్రవేశించి ప్రజలను అనేక అనారోగ్య సమస్యలకు గురి చేసాయి. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న నకిలీ మందుల వ్యవహారం సుమారు 200 బిలియన్ల అమెరికన్ డాలర్లకు పైగా ఉన్నట్లు ఒక అంచనా. ఎస్.ఎఫ్.ఎఫ్.సి మందుల వలన ఎన్నో దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. అపరిశుభ్రమైన వాతావరణంలో కలుషిత పదార్థాలతో, విషతుల్యమైన రసాయనాల తో తయారయ్యే ఈ మందులు శరీర అవయవాలను అనారోగ్యానికి గురి చేస్తాయి. ఈ మందుల ప్రభావం దీర్ఘ కాలం ఉంటుంది. ఈ మందుల వాడకం వలన జీవితాంతం అనారోగ్యం బారిన పడి, బాధ పడడం అల్పాయుష్కులుగా మారడం, మరణం సంభవించడం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం ఎస్.ఎఫ్.ఎఫ్.సి ఔషధాలు అంటే నాసిరకం చట్టబద్ధంగాని, తప్పుగా లేబుల్ చేయబడిన అవాస్తవికమైన పద్ధతిలో తయారైన నకిలీ మందులు. కొవిడ్ మహమ్మారి నకిలీ ఔషధాల ఉత్పత్తిదా రులకు ఒక పెద్ద ఆర్థిక అవకాశంగా మారిందని, ఇది ప్రజల ఆరోగ్య హక్కును హరించిందని, నాణ్యమైన ఆరోగ్య సేవలకు నకిలీ మందుల ఉత్పత్తి ఒక శరాఘాతమని ఎ.ఎస్.పి.ఏ నివేదిక పేర్కొన్నది. కేన్సర్, ఎయిడ్స్ మొదలైన రోగాలకు కూడా నకిలీ మందులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. నకిలీ మందులు జన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ప్రభుత్వాలకు రావలసిన ఆదాయాన్ని నకిలీ మందుల రూపంలో కొన్ని స్వార్థ శక్తులు తమ భోషాణాలకు తరలించుకుంటున్నాయి.

**కట్టుదిట్టమైన చట్టాలు అవసరం**

ట్రాక్ అండ్ ట్రేస్ విధానం వలన అద్భుతమైన ఫలితాలు పొందవచ్చు. భారత ప్రభుత్వం నకిలీ మందుల విషయంలో ఇప్పటికే అనేక చర్యలకు ఉపక్రమించింది. అయితే ఈ చర్యలు సరిపోవు. విచ్చలవిడిగా చెలామణిలో ఉన్న నకిలీ మందులపై ఉక్కు



పాదం మోపాలి. వైద్య రంగానికి చెందిన ప్రతీ ఒక్కరూ స్వంత లాభం కొంత మానుకుని దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణార్థం, ప్రాచీన కాలం నుండి దేశానికున్న ఘనమైన కీర్తిని నిలబెట్టడం కోసం ప్రయత్నించాలి. వైద్య వృత్తిని మానవీయ కోణంలో చూడాలి. వ్యాపారమయమైన వైద్య రంగాన్ని సమూల ప్రక్షాళన గావించాలి. వైద్య రంగాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. నకిలీ మందులతో కోట్లు గడిస్తున్న ప్రబుద్ధులకు తగిన గుణపాఠం నేర్పాలి. వైద్య రంగంలో ప్రబలిన అనైతిక ధోరణులకు చరమగీతం పాడాలి. ఆరోగ్యవంతమైన నూతన సమాజ స్థాపనలో వైద్యరంగం ప్రధాన భూమిక పోషించాలి. ఎలాంటి ప్రమాణాలు లేని, అనధికార ఔషధ విక్రయాలను నిషేధించడానికి కట్టుదిట్టమైన చట్టాలు రావాలి. ప్రసిద్ధ ఫార్మా కంపెనీల ఔషధాలను పోలిన నకిలీ మందుల వల్ల ఆయా కంపెనీల ప్రతిష్ఠ దెబ్బతింటున్నది. భారత దేశంలో విచ్చలవిడిగా తయారౌతున్న నకిలీ మందుల విషయంలో డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా అన్ని రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో, సమన్వయంతో పని చేయాలి. ఆన్‌లైన్ మందుల అమ్మకా లను నిలిపివేయడానికి, ఇతర దేశాల సహకారంతో పటిష్ఠమైన యంత్రాంగాన్ని తయారు చేయాలి. భారతదేశం విలువలకు ప్రాధా న్యతనిచ్చే దేశం. భారతీయ సాంప్రదా యాలు మానవత్వం ఉట్టిపడుతుంది. నకిలీ ఔషధాలు సరిహద్దులు దాటి అంతర్జాతీయ విపణిలో అడుగు పెడుతు న్నాయి. రోగి ప్రాణాలను కాపాడాల్సిన వైద్యరంగం వ్యాపారాత్మకంగా పరివర్తన చెందడం, వైద్యరంగంలో డబ్బుకే తప్ప ప్రాణాలకు విలువ లేని పరిస్థితులు ఏర్పడడం అత్యంత బాధాకరం. చిన్న చిన్న అనారోగ్యాలకు సైతం పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేయడం, ఆసుపత్రుల చుట్టూ తిప్పించడం, అనవసరమైన వైద్య పరీక్షల పేరుతో సామాన్యులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం, వివిధ కంపెనీలతో అవగాహన కుదర్చుకుని, ఆయా కంపెనీల మందులనే రోగులకు ప్రిస్క్రైబ్ చేయడం సరైన పద్ధతి కాదు. నాణ్యతా ప్రమాణాలు గల ఔషధాలు నకిలీ మందుల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలి. ఫార్మా కంపెనీలు, వైద్యులు, ఫార్మసీ రంగ నిపుణులు బాధ్యతాయుతంగా వ్యవ హరించి, రోగుల ప్రాణాలను హరిస్తున్న నకిలీ మందులను జన బాహుళ్యం నుండి తరిమికొట్టాలి. ❑

# తెలుగులో సంకీర్తనా సాహితీ వైభవం




అన్నమయ్య, గోపన్న, తాగయ్య యిత్యాదిగా తెలుగు పలుకుబడిని, సంకీర్తనలుగా, భాషా మాధుర్యాన్ని సంపన్నవంతం చేసిన వాగ్గేయకారులు ఎందరో వున్నారు. తాము పుట్టి పెరిగిన ప్రాంతం ఏదైనా, నాటి ఎల్లలు లేని దక్షిణా పథాన్ని, తల్లి ఉగ్గుపాలతో నేర్పిన మాటలతో క్రమేపీ వాగ్గేయకారులుగా భగవత్సంకీర్తనలు సృష్టించి తెలుగు వాక్కు, పలుకుల సొబగులను భక్తి తాదాత్మ్యంతో ప్రపంచానికి చాటిచెప్పినవారిలో అన్నమయ్య, గోపన్న, తాగయ్య సుప్రసిద్ధులు. ముగ్గురూ సమకాలికులు కాకపోయినా నాదోపాసన ఆరాధనగా భక్త్యావేశంతో ఆర్తి, ఆవేదన, ఆనంద, విషాద అంతరంగం భగవదనుభవాలతో, తెలుగులో భక్తి సాహిత్యాన్ని ఉన్నత శిఖరంపై అధిష్ఠింపచేసారు. తాళ్లపాక అన్నమాచార్యులు (1403-1508) అంతర్యామిగా లోక వ్యవహారానికి సాక్షీభూతుడైన పరమాత్ముని గుర్తించి, వేదవేదాంత సారాంశాన్ని ఉపనిషత్‌ల, జ్ఞాన వైరాగ్య మహోన్నతను పద సంకీర్తనాచార్యునిగా తెలుగుజాతికి అందించారు. 32 వేల సంకీర్తనలు రచించిన అన్నమయ్య ఏడుకొండల వేంకటేశ్వరుని సేవలో జనసామాన్యాన్ని నేటికీ తరింపచేస్తున్న ప్రాతఃస్మరణీయులు. రాగిరేకుల మీద బహిర్గతమైన అన్నమయ్య పదాలలో భక్తి పారవశ్యంతో పాటు నాటి సాంఘిక పరిస్థితులు కూడా అక్కడక్కడ ప్రతిబింబిస్తున్నాయి. నేటికీ పసిబిడ్డలను నిద్రపుచ్చే సమయంలో తెలుగుతల్లులు పాడే "జో అచ్యుతానంద జోజో ముకుందా" అన్నమయ్య వేంకటేశ్వరునికి పాడిన జోలపాట. శ్రీ వేంకటేశ్వరుని మేలుకొలుపు మొదలు పవళింపు సేవ వరకు భాగవత సంకీర్తనా సంప్రదాయం ప్రతిష్ఠించి, పద సాహిత్యమే భక్తికి పరమావధిగా, తెలుగు సంగీత విద్వన్మణిగా శాశ్వత కీర్తి ప్రతిష్ఠలు సాధించారు. "తెలుగు పదాలను జోడించటంలో తిక్కనకు కుడిచేయి అన్నమయ్య. భావనా ప్రపంచంలో అన్నమయ్య కవిత్వం సర్వాంగణమైన తెనుగు చక్కెరబొమ్మ" అన్నారు పుట్టపర్తి నారాయణాచార్యులు. "అచ్చతెనుగు నుడికారంతో, పల్లెపట్టుల తెలుగు పదాలతో అలరారే, అన్నమయ్య కీర్తనలు దురదృష్టవశాత్తు 1949లోగానీ వెలుగుచూడలేదు. అవి శతాబ్దాల క్రితం బహిర్గతమైవుంటే తెలుగుభాష ఇప్పటి దుర్గతి పట్టేది కాదు" అన్నారు వేటూరి ప్రభాకరశాస్త్రి. అన్నమయ్యను మనం బతికించుకుంటే తెలుగు సాహిత్యం అజరామరం అవుతుంది. అన్నమయ్య కీర్తనలలో బాజరలు, చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెదలు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, జోజో, జేజే, జయజయ, మేలుకొలుపులు, నలుగులు, దంపుళ్లు, కొట్నాలు, గుజ్జెనగూళ్ళు, అల్లోనేరేళ్ళు, చాంగుభళాలు, తందానాలు వేనకువేలు. భక్తితో పాటు రక్తి ద్వారా ముక్తిసాధనతో అన్నమయ్య పదం సాహిత్య ప్రాధాన్యత పొందింది. కానీ ఇవాళ అందుబాటులో ఉన్నవి ఏడు వందలకు మించవు.

కంచర్ల గోపన్న (భక్తరామదాసు) (1620-1684) మార్గ పద్ధతిలో సామాన్యుల దరికి సంకీర్తనలను సిసలైన తెలుగు జానపద మాధుర్యంతో అందించిన శ్రీరామ భక్తాగణ్యునిగా సుప్రసిద్ధులు. అన్నమయ్యలాగా, గోపన్న వైష్ణవ మతం స్వీకరించి రామదాసుగా ప్రఖ్యాతి పొందారు. గోల్కొండ మంత్రులు అక్కన్న, మాదన్నలకు మేనల్లుడైన రామదాసు, భద్రాచలం తహసీల్దారుగా శ్రీరామచంద్రుని మించిన దైవం లేదనే ప్రగాఢ భక్తితత్పరతతో శిస్తుల ప్రజాధనాన్ని వినియోగించి, భద్రాచల రామాలయం నిర్మించాడు. నాటి గోల్కొండ పాలకుడు అబ్దుల్లా కుతుబ్‌షా ఆగ్రహంతో, కఠిన కారాగారవాస శిక్ష విధించాడు. గోల్కొండ కోటలో నేటికీ రామదాసు బందీఖానా వుంది. ప్రభువుకు చెల్లించవలసిన 6 లక్షల వరహాలు శ్రీరామ కైంకర్యానికి వినియోగించిన రామదాసుకు ఇనుప సంకెళ్లు వేసి చీకటికొట్టులో బంధించి వందుకుతినమని పావుశేరు బియ్యం, ఉప్పు యిచ్చేవారు. బందీఖానాలో గోడ మీద సీతారాముల బొమ్మలు చెక్కు కొని నివేదన చేసిన కథనం వుంది. 12 సంవత్సరాలు చెరసాలలో బందీ గా పడిన కఠిన శిక్షల శారీరక, మానసిక వేదన 'రామదాసు బందిఖాన' కీర్తనానుభవాలుగా తెలుగు సాహితీ పుటలలో ఆయన వేదనాయుత జీవనాన్ని స్పష్టం చేసింది. అబ్దుల్లా కుతుబ్‌షా, పాలనా సామర్థ్యం లేని గోల్కొండ నవాబుగా చంచల స్వభావి కావడంతో క్రూరత్వం, మానవత్వం రెండూ వుండేవి. అతడు రామదాసును చెర నుంచి విడిపించిన కథనం (కలలో శ్రీరామచంద్రుడు) నిజమా? కాదా? చరిత్రలో నిక్షిప్తమైంది. "రామాచంద్రులు నాపై చలము చేసినారు సీతమ్మ.. చెప్ప వమ్మా" "నన్ను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లి", "తక్కువేమి మనకు, రాముండొక్కడుండు వరకూ", "తారకమంత్రము కోరిన దొరకెను. ధన్యుడనైతిని ఓరన్నా", "పలుకే బంగారమాయెనా కోదండపాణి" ,"ఏ తీరున నను దయ చూచెదవో", "ఇక్ష్వాకు కులతిలక ఇకనైన పలుకవే రామచంద్రా", "కాంభోజి రాగం ఆదితాళం కీర్తనలో 'కాళ్లకు సంకెళ్ల, దెబ్బలకోర్వలేక అబ్బ తిట్టితినయ్య" అంటూ మొర పెట్టుకోవడం, 'దెబ్బలను పడలేను అప్పు తీర్చుమని' వేడ్కోలు భక్తరామదాసు జీవన విషాదం తెలియచేస్తున్నాయి. సౌరాష్ట్ర రాగం ఆదితాళంలో "రామదాసుగారండీ! రసీదం దుకోండి. ప్రేమమీర శ్రీరామ లక్ష్మణులు తామే ధనమంతయు చెల్లించిరి" అంటూ తానీషా చెప్పినట్టుగా కీర్తన కూడా గ్రంథస్థమైంది.

"అదిగో భద్రాద్రి" అంటూ పవిత్ర గౌతమీ తీరంలో భక్తరామదాసు, కావేరీ తీరంలో నాదబ్రహ్మ త్యాగయ్య అసంకల్పి తంగా, ఆశుధారా సంజనితంగా, అప్రయ త్నంగా అద్వైత యోగ సిద్ధితో సంగీత, సాహిత్యాలకు అభిన్నంగా వెలువడిన 'కీర్తనలు తక్కువేమి మనకు' అంటూ అమ్మ పలుకును సగర్వంగా గౌరవించి, ఆరాధించే తాదాత్మ్యం కలుగచేస్తాయి.

**- జయసూర్య**

## ఖజురహో శిల్పకళలో అదరహో

(15వ పేజీ తరువాయి)

వ్యక్తపరిచేందుకు ఆ రోజుల్లో వ్యాప్తిలో ఉన్న భంగిమల రూపంలో కళాకారుల ఊహల నుంచి పుట్టినవిగాగానీ లేదా కామసూత్రలో చెప్పబడిన నియమాల ఆధారంగా పుట్టినవిగానీ అయ్యుండవచ్చు. అనేకమంది శిల్పులు తమ కళాత్మక యాజమానిత్వాన్ని అనేక శిల్పాలపై పేర్కొన్నారు. నలుపు, ఊదా లేదా లేత పసుపు రంగులకు చెందిన వివిధ రకాల వర్ణాలతో కూడిన ఇసుకరాతితో నిర్మితమైన ఈ దేవాలయాలు శివుడు, విష్ణువు, జైన మత గణాలకు చెందినవి.

ఖజురహోలోని మరో దేవాలయం లక్ష్మణాలయం. 930-950 మధ్య ప్రాంతంలో నిర్మితమైన విష్ణాలయం, లక్ష్మణాలయం ప్రవేశ ద్వారంపై శివుడు, బ్రహ్మ, లక్ష్మి మొదలైన విగ్రహాలు, ద్వార బంధనాలపై నవగ్రహాలు అద్భుతంగా మలచారు. దీనికి సమీపంలో లక్ష్మి వరాహ ఆలయాలున్నాయి.

వరాహావతారంలో శ్రీ మహావిష్ణువుని ఇక్కడ దర్శించుకోవచ్చు. కందరీయ మహాదేవ ఆలయ సమీపంలో దేవి జగదాంబా ఆలయం ఉంది. ఒకప్పుడు ఇది విష్ణు ఆలయం అని కొందరు చెబుతుంటారు. తరువాత ఈ దేవళాన్ని పార్వతీ అమ్మవారి ఆలయంగా మార్చారు. అమ్మవారి విగ్రహాన్ని నల్ల రంగుతో కాళీమాత విగ్రహంగా రూపొందించబడినది.

మరో దేవళం చిత్రగుప్త ఆలయంలో ఏడు గుర్రాలపై అధిరోహిస్తున్న సూర్యభగవానుని విగ్రహం పరమాద్భుతంగా కనిపిస్తుంది. దశావతారాలకు సంబంధించిన పది తలల శ్రీమహావిష్ణువు విగ్రహం, నర్తకీమణుల నృత్య దృశ్యాలు, వేట, యుద్ధం, ఊరేగింపులు.. ఇత్యాది శిల్పాల చిత్రీకరణ బహు రమణీయంగా కనిపిస్తాయి. ఇంకొక దేవళం విశ్వనాథ నందీశ్వరాలయం. శివుడు, ఆయన వాహనమైన నందీశ్వరుని విగ్రహాలు చూడవచ్చు. బ్రహ్మలోక దృశ్యాలు కూడా చెక్కబడి ఉన్నాయి. వరాహస్వామి భూమాతను రక్షిస్తున్న వైనం మతంగేశ్వరాలయంలో చూడవచ్చు. చిన్న చిన్న విగ్రహాలతో అతి నిరాడంబరంగా ఈ ఆలయం కనిపిస్తుంది.



ఖజురహో దేవాలయా లన్నింటి లోకి పెద్దది పార్శ్వ దేవాలయం. ఇది జైన దేవాలయం, తొలుత ఆదినాథుని ఆలయంగా నిర్మించబడింది. తరువాత ఆ విగ్రహం తొలగించబడి పార్శ్వనాథ మూర్తి ప్రతిష్ఠించబడింది. ఒక శతాబ్ద కాలం క్రితం నిర్మించబడిన జైన దేవాలయం శాంతినాథ ఆలయం. ఇందులో నాలుగున్నర అడుగుల ఆదినాథుని విగ్రహం ఉంది. క్రీ.శ.1000లో నిర్మితమైన విష్ణాలయం జావరి. ఇక్కడ అందమైన స్త్రీల శిల్పాలు ఉన్నాయి. శ్రీమహావిష్ణువు మరుగుజ్జు అవతారమైన వామనునికి నిర్మించిన ప్రత్యేక ఆలయం వామనుని



దేవాలయం. ఇది జావరి ఆలయం కంటే కొద్దిగా పురాతనమైనది. దీని గోపుర నిర్మాణం నిరాడంబరంగా ఉన్నా, గోడలపై వివిధ భంగిమల్లో అందాల భామల శిల్పాలు కనిపిస్తాయి. బ్రహ్మదేవునికి ఆలయం లేదని చెబుతుంటారు. రాజస్థాన్‌లోని పుష్కర్‌లో బ్రహ్మకు ఆలయం ఉంది. అదేవిధంగా ఖజురహోలో కూడా ఒక ఆలయం ఉంది. ఈ దేవాలయమంతా నల్లరాయి, కారు రాతితో కలిపి నిర్మించారు. అయితే ఇక్కడ విశేషమేమిటంటే ఇది బ్రహ్మలయమే అయినా విష్ణువు కోసం దీన్ని నిర్మించారు. అంటే పేరుకే ఇది బ్రహ్మలయమన్నమాట. దీని సమీపంలో క్రీ.శ.922లో నిర్మించిన హనుమాన్ దేవాలయంలో 2.5 మీటర్ల ఎత్తుగల హనుమంతుడి విగ్రహాన్ని తిలకించవచ్చు.

ఖజురహో గ్రామానికి దక్షిణ భాగంలో 4 కి.మీ. దూరంలో మరికొన్ని దేవాలయాలు ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనది దూలదేవ్ ఆలయం. దీని గోపురం గుండ్రని రాళ్లతో విచిత్రంగా నిర్మించారు. రతీ భంగిమల్లో కనిపించే శృంగార శిల్పాలకు ఆలవాలంగా ఈ దేవళం కనిపిస్తుంది. ఇటువంటి శిల్పాలను చూసిన కొందరు మేధావుల అభిప్రాయానుసారం 'ఖజురహో కామకేళి శిల్పాలను తిలకిస్తే నపుంసకుడు సైతం పుంసకుడుగా మారతాడని' చెప్పడమనేది అక్షర సత్యంలా గోచరిస్తుంది. ఇక్కడి చతుర్భుజాలయంలో మూడు మీటర్ల ఎత్తుగల విష్ణు విగ్రహం నాలుగు చేతులతో సుందరంగా కనిపిస్తుంది. ఇప్పటికీ ఖజురహో చిన్న గ్రామమే. అయిప్పటికీ ఇక్కడి శిల్ప సంపదను తిలకించడానికి అనునిత్యం దేశ విదేశాల నుండి యాత్రికులు వస్తుంటారు. ఈ కారణంగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తూ ఇక్కడ విమానాశ్రయాన్ని కూడా ఏర్పాటు చేయడం విశేషం. ఈ శిల్పాలు, ఆలయాలే కాక ఇంకా అనేక అపురూప శిల్పాలను ఖజరుహోలోని ధుబేలా మ్యూజియంలో భద్రపరచి యాత్రికుల సందర్శనార్థం ఉంచారు.

ప్రతీ ఏడాది ఈ ప్రాంతంలో ఖజురహో నృత్య సమాహారం జరుగుతుంది. దేశంలోని నాట్యకారులు, నర్తకీమణులు ఇక్కడ జరిగే జాతీయ స్థాయి నృత్య పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటి చూపుతారు. ఉత్కృష్టమైన శిల్పకళతో భాసిల్లుతూ అదరహో అనిపించే ఖజురహో గురించి ఎంత చెప్పినా తక్కువే అనిపిస్తుంది.

ఇంకా ఈ ప్రాంతంలో రాయ్‌గఢ్ భవనం, రంగౌన్ సరస్సు, రాణే జలపాతంతో పాటు సందర్శించదగిన అనేక ప్రదేశాలు ఉన్నాయి. ❑

# సిరులు తెచ్చే సింహద్వారాలు


**వాస్తువార్త**

వాస్తు విద్వాన్ సాయిశ్రీ


డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




**సిం**హద్వారం అంటే ఇంటి ప్రధాన ద్వారం. ఇంట్లోవాళ్లు వీధిలోకి వెళ్లటం తిరిగి ఇంట్లోకి రావటం ఆ ద్వారం గుండా సాగుతుంది. ఆ నడక వాళ్ల జీవితం మీద ప్రభావం చూపిస్తుంది.




ఈ చక్రాన్ని 'గృహ ముఖద్వారాలుంచే భాగచక్రము' అంటారు.

ఇంటికి ఉన్న నాలుగు భుజాలను ఈశాన్య, వాయువ్య, నైరుతి, ఆగ్నేయ మూలలు కాక తొమ్మిదేసి సమ భాగాలుగా విభజింపబడ్డాయి. ప్రతి భుజంలోనూ 'మనుష్యద్వారం' నుండే మనుషులు నడక సాగించాలని అర్థమవుతోంది. దేవతా ద్వారం గుండాగానీ, పశుద్వారం గుండాగానీ మనుషుల సంచారం నిషేధించబడినదని కూడా తెలుస్తోంది. 'సింహద్వారం' లేదా 'ముఖద్వారాన్ని' నిర్మించటం అంటూ జరిగితే ఆ భుజంలో లేదా ఆ దిక్కున 'మనుష్యద్వారం' అని సూచించిన దగ్గరే సింహద్వారాన్ని నిర్మించాలని అవగతం అవుతోంది.

ఈ చక్రాన్ని స్టాండర్డుగా తీసుకుంటే- ఉత్తర ముఖద్వారాన్ని చక్రంలో సూచించినట్టు కట్టుకుంటే ఈశాన్యానికి దగ్గరలో వున్న శుక్రస్థానం నుండి మనుషుల నడక మంచిదే. శుభప్రదం, కట్టుకోవచ్చు. దక్షిణ ముఖ ద్వారాన్ని ఈ చక్రం ప్రకారం అమర్చవలసి వస్తే అక్క దున్న శుక్ర స్థానంలో అమర్చాలి. అప్పుడు నడక 'దక్షిణ నైరుతి' వైపు సాగుతుంది. ఈ నడక మంచిది కాదని వాస్తుశాస్త్రం ఏమాత్రం తెలిసినవాళ్లయినా ఒప్పుకుంటారు.

తూర్పు ముఖద్వారాన్ని ఈ చక్రం ప్రకారం అమర్చవలసి వస్తే అక్కడున్న శుక్ర స్థానంలో అమర్చాలి. అలా నడక 'తూర్పు ఆగ్నేయం' కి దగ్గరలో సాగుతుంది. ఇది కూడా మంచిది కాదు. పడమరలో ముఖద్వారాన్ని 'కుజస్థానం' లో అమర్చినప్పుడు నడక 'పడమర నైరుతి' వైపు సాగుతుంది. ఇది కూడా మంచిది కాదు.

అటువంటప్పుడు ఈ 'భాగచక్రం' సత్ఫలితాలు కాస్త అయోమయంలో పడేసే మాట వాస్తవం.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే- కొందరు ఇంటి యజమానుల 'నామ నక్షత్రాన్ని' బట్టి సింహద్వారాలను నిర్ణయిస్తుంటారు. ఇది కూడా సరైంది కాదు. ఒక ఇల్లు నిర్మాణం జరిగితే అది తరతరాల వారికి నివాస యోగ్యంగా ఉంటుంది. ఇప్పుడు ఒక వ్యక్తి ఒక ఇంటిని నిర్మించుకుని తన నామనక్షత్రం ప్రకారం సింహద్వారాన్ని ఏర్పాటు చేసుకున్నాడను కుందాం. ఆ వ్యక్తి కుమారులుగానీ, మనవలుగానీ అదే ఇంట్లో ఉండవచ్చు. దాన్ని భాగాలుగా పంచుకోవచ్చు. ఆయనలాగే వాళ్ల కూడా తమ నామ నక్షత్రాల ప్రకారం ఆ ఇంటి సింహ ద్వారాన్ని ఏర్పాటు చేసుకోవటం జరుగు తుందా? అలా చేయాల్సి వస్తే ఇంటి స్వరూప స్వభావాలు ఏం కావాలి? తరాలు మారుతున్నకొద్దీ ఇంటి యజ మాని మారుతూ వుంటాడు. ఇంటిని ఈ సిద్ధాంతం ప్రకారం చిన్నాభిన్నం చేయటం జరగాల్సిందే! అది కూడా సరైన పద్ధతి కాదు.

'వాస్తు' అన్నది విశ్వమంతటికీ ఒకే పద్ధతిలో ఉంటుంది. కొన్ని ప్రత్యేక కట్టడాలకు ప్రత్యేక మినహాయింపులు, మార్పులు ఉండవచ్చు.

కానీ మూల సిద్ధాంతాలను ఎవరూ కొట్టిపారేయలేరు.

ఇంటి యజమాని పుట్టిన తేదీని, సమయాన్ని, జన్మ నక్షత్రాన్ని బట్టి సింహ ద్వారం నిర్ణయం చేస్తామని ఎవరైనా అంటే అనవచ్చు.

కానీ దాన్ని ఆచరణలో పెట్టాలా? వద్దా? అన్న మీమాంస పెట్టుకోకండి.

సింహ ద్వారాన్ని నిర్ణయించే పద్ధతిని శాస్త్రపరంగా అర్థం చేసుకొని ముందుకు అడుగు వేయండి. లేదా శాస్త్రాన్ని సైంటిఫిక్‌గా చెప్పి ఒప్పించగలిగే వాళ్లను వ్యక్తిగతంగా సంప్రదించి నిర్ణయం తీసుకోవడం మంచిది.

మీరు తీసుకోబోయేది చక్కటి నిర్ణయ మైతే ఆ సింహద్వారం గుండా నడక మీకు సిరులు తెచ్చిపెడుతుంది. ❑



# నా కోసమేనా...!

ప్రియమైన...

నీ ఉత్తరాలు అన్నీ అందాలు.
నువ్వు అడిగిన ప్రశ్నలకు నీకు
మాత్రం జవాబు చెప్తే
సరిపోదు. కనుక ఆ జవాబుని
అందరికీ తెలిసేలా చెప్తున్నాను.
నా రాతలు ఆవేదనాభరితమైనవని
అంటున్నావు... ఎందుకలా రాస్తున్నావో
అర్థం కావడం లేదని అంటున్నావు.
నిజానికి నేనేమీ అంతులేని
శోకసాగరంలో తేలియాడటం లేదు.
అలాగని పూర్తిగా ప్రశాంతంగా లేను.
రెండింటికీ మధ్య స్థితిలో ఉన్నాను.
నిజం చెప్పాలంటే సంతోషభరితమైన



కవితలకంటే ఆవేదనతో కూడిన
కవితలతోనే పలువురి జీవితాలు
ముడిపడి ఉంటాయి. కొందరు
చెప్పుకుంటారు. కొందరు చెప్పుకోరు.
అంతే తేడా.
కవితలు పంచుకున్నట్టు మరేవీ కన్నీటినీ
పంచుకోలేవు. అంటే కన్నీటిచుక్కలు
ఎంతలా సహకరిస్తాయో చెప్పలేను.
సహజంగా ఏడ్వలేకపోయినా కృత్రిమంగా
ఏడవటం ఆలోచనకు ఎంతో కొంత
బలమిస్తోంది. ఇంధనమవుతోంది అనే
నా అనుభవం.
నిజానికి పాట రాయడం కన్నా
నలిగిపోయేవారికి పాట రాయడం,
కవితలల్లడం సులభం.
ఈశ్వరుడి ముందర నవ్వుతూ
కూర్చోవడం కన్నా ఏడుస్తూ
కూర్చోవడంలో ఓ ప్రశాంతత ఉంటోంది.
ఇది అనుభవపూర్వకం.
ఇవన్నీ నా బలహీనతలనుకుంటే ప్రతి
మనిషీ బలహీనుడే.
నాకు మరణం అంటే భయం లేదు.
అధిగమించలేని, అడ్డుకోలేనిదాని గురించి
ఆలోచిస్తూ నేనెందుకు భయపడుతూ
కూర్చోవాలి.. ఆలోచించాలి.
విధిరాత ఎలా ఎక్కడ ముగుస్తుందో
అక్కడ ప్రతి ఒక్కరి కథా
ముగియాల్సిందే. ఈ విషయంలో
ఎవరూ ఏమీ చేయలేరు.
పుట్టినవన్నీ గిట్టకమానవు. దీనిని ఎవరూ
తప్పించలేరు. అది ధర్మమైతే
మరణించినవన్నీ పుడతాయనేదే
హిందూ ధర్మం.
దేవుడా, నన్ను మళ్లీ పుట్టించబోకు అని
స్తుతించారో జ్ఞాని.
కానీ నేను మళ్లీ పుట్టాల
నుకుంటున్నాను.
అందుకు మరణాన్ని నేను
ఆహ్వానిస్తున్నాను. అందుకే నాకు
మరణం గురించి ఎటువంటి భయమూ
లేదు.
ప్రేమ చూపించే హృదయంలో జాలి
కూడా పుడుతుందనడానికి నువ్వొక
ఉదాహరణవు.
కనుక నా అక్షరాలలో చిన్నపాటి ఆవేదన
ధ్వనించినా అది నీకు పెద్దగా
అనిపిస్తోంది.
ఓ కాలం ఆనందానికి సరిపోతుంది.
మరొక కాలం ఆవేదనకు సరిపోతుంది.
ఈ రెండూ ఒక దాని వెంట ఒకటి
వస్తూనే ఉంటాయి. అది ఓ వలయం.
అది ప్రకృతి ధర్మం. సహజం కూడా.
కానీ నా ధర్మం ఆవేదనలతో
ముడ్డుబారింది. ఓ రాతిపైన తేనె పోస్తే
అది తాగుతుందా ఏమిటి?
ఆనందాలు వస్తున్నాయి కానీ హృదయం
వాటిని ఆస్వాదించడం లేదు.
ఆవేదనలు రాయమని
రెచ్చగొడుతున్నాయి.
కనుక వాటిని నేను
మరచిపోలేను.
నా కోసం జీవిస్తున్న
ప్రాణంగా నిన్ను నువ్వు
ఊహించుకుంటున్నావు...
మంచిది.
కలలో కనిపించే
దృశ్యాలను ఫొటో తీసి
దాచుకోలేం కదా.
ఊహాతీతమైన వాటినే ఆలోచిస్తూ
కూర్చుంటే కాలాన్ని వృధా చేసిన
వారమవుతాం.
కొలనులో పేరుకుపోయిన నీటిని
తాగేటప్పుడు అవి చెల్లాచెదరు కాకుండా
చాలా జాగ్రత్తగా తాగాలంటారు భగవాన్
రామకృష్ణ పరమహంస.
నాకు సంబంధించినంతవరకు నీ స్థితి
కూడా అంతే అనిపిస్తోంది.
ఎండిన నదిలో తిరిగి నీటి ప్రవాహం
వచ్చేటప్పుడు నా తీరాన నీ కోసం
నిరీక్షిస్తుంటాను.
ఇప్పుడు నా తీరాన ఉన్న నీ మీది
జ్ఞాపకాలను కాపాడుకోవడమే నా
కర్తవ్యం.
విరక్తీ, వేదాంతమూ నేనేమీ ఇష్టపడి
స్వీకరించినవి కావు. అవే నన్ను
వెతుక్కుంటూ వచ్చాయి.
తత్వజ్ఞానం అక్కడి నుంచే పుట్టుకొస్తుంది
అంటారు జ్ఞానులు. దానిని కష్టాలు
కన్నీళ్లతో నాకు ఆ భగవంతుడు ఇచ్చిన
కానుక అనుకుంటాను.
ముప్ఫై సంవత్సరాల క్రితం నువ్వు
నన్ను కలిసుంటే నువ్వే అందుకు
కారణమై ఉంటావు.
ఇప్పుడు అందుకోసం మరికొందరున్నారు.
అయినా నీ విజ్ఞప్తి మేరకు నా శ్రమ
పరిశ్రమ తగ్గిపోకుండా చూసుకుంటు
న్నాను. అది కూడా నీ కోసం.
కారణం.. నీ ఉత్తరం చూస్తుంటే నేను
అర్థం చేసుకున్నది నువ్వు బతుకుతున్నది
నా కోసమేనన్నది.
ఇట్లు నీ ప్రియమైన..

**- యామిజాల జగదీశ్**

















# డబుల్ సైడ్ ఆభరణాలు

**ఫ్యాన్సీ** చీర కట్టుకుని సంప్రదాయ ఆభరణాలు వేసుకుంటే బాగోదు కదా..అందుకే అతివలందరూ అన్ని వస్తువులతో పాటు మ్యాచింగ్ ఆభరణాలను అమర్చుకుంటారు. ఆ సంగతి గమనించిన జ్యువెలరీ డిజైనర్లు ఎప్పటికప్పుడు నగల్లో ట్రెండ్స్ తీసుకువస్తున్నారు. ఒకే నగలో రెండు రకాల డిజైన్లతో ఉండే 'ఫ్లిప్, రొటేటబుల్ జ్యువెలరీ'తో. నిజానికి 'ఐటమ్ ఒకటే అయినా ఉపయోగాలు' రెండు అన్న అంశం మీద ఎన్నో రకాల వస్తువులు, దుస్తులు వస్తుంటాయి కదా. అదే సూత్రం నగల్లోనూ వచ్చేసింది. ఇదివరకే ఇలా రెండు విధాలుగా వేసుకునే రివర్సిబుల్ నగలు ఉన్నాయి కానీ వాటిల్లో ఎక్కువగా రాళ్ల రంగుల్లో మాత్రమే తేడా కనిపించేది. ఒకవైపు కెంపులు, మరోవైపు పచ్చలతో రెండు రకాలుగా తిరగేసి పెట్టుకునేలా నెక్లెసులూ, లాకెట్లు, దుద్దులూ అందుబాటులో ఉండేవి. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఈ రొటేటటబుల్ నగల్ని తయారు చేస్తున్నారు. వాటిలాగా తిరగేసి వేసుకునేలా ఉండవివి. అటూ ఇటూ తిప్పడానికి వీలుగా ఉండే బిళ్లల్లోనే ఉంటుంది వైవిధ్యమంతా. బిళ్లకు ఒకవైపు లక్ష్మీదేవి, రామపరివారం, దశావతారా రూపాలు ఉంటే ఇంకోవైపు సొంపైన డిజైన్లలో కెంపులూ, పచ్చలూ, వజ్రాలు, ఎనామిల్ చమక్కులూ ఎంతో అందంగా పొదిగి ఉంటాయి.







# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు మంజూరవుతాయి. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారులకు శ్రమ పెరుగుతుంది. వృధా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. శుభ కార్యాలకు హాజరవుతాయి. హోల్ సేల్ వ్యాపారులకు బాగుంటుంది.

## వృషభం



వృత్తి వ్యాపారస్తులకు యథాతథంగా ఉంటుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. పాప కార్య చింతన మంచిది కాదని తెలుసుకుంటారు. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది, ఇది శుభ సూచకం. వివాహాది శుభ కార్యాలకు హాజరవుతారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఆత్మీయులను కలుసుకుంటారు.

## మిథునం



శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. ఆదాయానికి మించిన ఖర్చులు అసహనం కలిగిస్తుంది. వివాదాల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. వృధా ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఉద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. దూర ప్రాంతంలో వున్న ఆత్మీయుల నుండి శుభ వార్తలు వింటారు. గృహ యోగం.

## కర్కాటం



ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ధర్మ రక్షణకై పాటుపడతారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. చోర భయం పొంచి వుంది. విలువైన పత్రాల విషయంలో జాగ్రత్త.

## సింహం



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక వారాంతంలో తీరుతుంది. ఊహించని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. విద్యా, వైద్య రంగంలో వున్నవారికి పదోన్నతులు లభించే సూచనలున్నాయి.

## కన్య



ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. ధార్మిక చింతన అలవడుతుంది. సామాన్య ధన లాభాలుంటాయి. భూ వివాదాలు తీరుతాయి. స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటాయి. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. చిరు వ్యాపారులకు పోటీ ఏర్పడుతుంది.

## తుల



గృహ రుణాలు తీర్చి ఊరట పొందుతారు. కింది స్థాయి ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు సంయమనం కోల్పోకండి. ధార్మిక చింతన అలవర్చుకుంటారు. కాలానుగుణంగా వ్యాపారాలు చేసేవారికి బాగుంటుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు వారాంతంలో పూర్తి చేస్తారు. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. కళాకారులకు సన్మాన యోగం.

## వృశ్చికం



క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకండి. వృత్తి కళాకారులకు ఆర్థికంగా బాగుంటుంది. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. ఆహార, ఆరోగ్య సలహాలు-సూచనలు పాటించండి మంచిది. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించండి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. దేవాలయాలు సందర్శిస్తారు.

## ధనుస్సు



వృధా ప్రయాణం చేస్తారు. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. భాగస్వామ్య వ్యాపారస్తులు సామరస్యంతో సమస్యలు పరిష్కరించుకోవడం మంచిది. వివాదాలకు దూరంగా ఉండడ శ్రేయస్కరం. ఉద్యోగులకు సహోద్యోగులతో సఖ్యత పరిచయం ఏర్పడుతుంది. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి యథాతథంగా ఉంటుంది.

## మకరం



శత్రువులు మిత్రులవుతారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. సన్నిహితుల సహకారంతో చిరు వ్యాపారం ప్రారంభిస్తారు. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. వ్యవసాయదారులకు బాగుంటుంది. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తవుతాయి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. శ్రమకు తగిన ప్రతిఫలం లభించకపోవచ్చు. వాహన యోగం.

## కుంభం



ధర్మ రక్షణకై పాటుపడతారు. చిరు వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. పెట్టుబడులకు సానుకూలం. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. ఊహించని వార్తలు వింటారు. వృధా ఖర్చులను నియంత్రిస్తారు. ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. కుటుంబంలో ఐకమత్యం లోపిస్తుంది.

## మీనం



ప్రయాణం లాభిస్తుంది. వ్యాపారులకు అనుకోని విధంగా స్వల్ప నష్ట సూచనలున్నాయి. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. అన్ని రంగాల్లోనివారు ఎంతో కొంత లాభపడతారు. మీ మంచితనమే మీకు శ్రీరామ రక్ష. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. ఆరోగ్య, ఆహార నియమాలు పాటించండి.

# రక్షిత అటవీ ప్రదేశంలో అరుదైన ఆలయం

తిన్నడు అంటే భక్తకన్నప్ప అని అంటే తెలియనివారు ఉండరు. భక్తకన్నప్ప కథ అందరికీ తెలిసిందే.

ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీకాళహస్తి. పంచభూత క్షేత్రాలలో వాయు లింగ రూపంలో సదాశివుడు కొలువై ఉన్న పవిత్ర ప్రదేశం. శివసేవలో తలెత్తిన విభేదాలతో సాలీడు, సర్పం, గజము లయకారుని సన్నిధిలో కన్ను మూసి, శాశ్వత కైలాసవాస వరం పొందాయి. వాటి మూడింటి పేర్లతోనే ఈ క్షేత్రానికి శ్రీ కాళహస్తి అన్న పేరు వచ్చింది. అంతటి దివ్య క్షేత్రంలో ముడిపడి ఉన్న పరమ భక్తాగ్రేసరుడు తిన్నడు. తన భక్తుని పరీక్షించడానికి పరమశివుడు పెట్టిన పరీక్షలో తన కన్నులను కపర్థికి సమర్పించుకొన్న అచంచల భక్తి విశ్వాసాలు తిన్నని సొంతం. స్వయంగా సర్వేశ్వరుడే అతని భక్తికి మెచ్చి "కన్నప్ప" అని నామకరణం చేసారు. శ్రీకాళహస్తి ఆలయ చరిత్రతో విడదీయని బంధం ఏర్పరచుకొన్న కన్నప్ప, గాయక భక్తులైన అరవై మూడు మంది నయన్మారులలో ఒకరిగా శాశ్వత కీర్తి పొందాడు.

తమిళ గ్రంథాలలో "కన్నప్ప నయనార్ లేదా నేత్రేశ నయనార్"గా పిలవబడే ఈయనకి రెండు ఆలయాలు ఉన్నాయి. ఒకటి తిన్ననికి శాశ్వత కైలాసవాసం కల్పించిన శ్రీకాళహస్తిలో చిన్న కొండ మీద (శ్రీకాళహస్తీశ్వరుని ఆలయంలో ఒకచోట నుండి కొండ మీద ఉన్న భక్త కన్నప్ప ఆలయాన్ని చూడవచ్చు). రెండవది పంచభూత స్థలాలలో అగ్నిక్షేత్రం అయిన తిరువణ్ణామలైలో ఉన్నాయి.



తిరువణ్ణామలై గిరివలయంలో ఉన్న ఈ ఆలయం చాలా పురాతనమైంది. ఎవరు ఎప్పుడు కట్టించారో అన్న వివరాలు అందుబాటులో లేవు. శిథిలమైన పాత ఆలయాన్ని పునఃనిర్మించారు. ఆలయ గోడల మీద కొన్ని పురాతన తమిళ శాసనాలు కూడా కనిపిస్తాయి.

గిరి వలయంలో వచ్చే నిత్యానంద ఆశ్రమం పక్కన అడవిలో ఉంటుందీ ఆలయం. గతంలో అనుమతితో వెళ్లడానికి అవకాశం ఉన్న అంతర గిరివలయ మార్గంలో ఉంటుంది ఈ ఆలయం. ప్రస్తుత




వెలుపలి గిరివలయం నుండి కూడా నిత్యానంత ఆశ్రమ ప్రహరీ గోడ పక్కగుండా వెళ్తే చిన్న కొండరాయి మీద ఉంటుంది.

మరో గుర్తు ఏమిటంటే.. మనకు ఎడమ పక్కన శ్రీ దండాయుథ పాణి, శ్రీ రాజ రాజేశ్వరీ అమ్మవారి దేవాలయాలుంటాయి. ఎదురుగా రహదారికి అటుపక్కన ఉన్న కంచె దాటి అడవి మార్గంలో అర కిలోమీటరు నడిస్తే వస్తుంది ఆలయం.



కానీ ప్రస్తుతం కాపలా పటిష్టం చేశారు. ఎవరూ ప్రవేశించడానికి వీలు లేకుండా బలమైన కంచె ఏర్పాటు చేశారు అటవీ అధికారులు.

చిన్న మండపం, గర్భాలయంతో ఉన్న పై భాగానికి చేరుకోవడానికి సోపాన మార్గం ఉంది. మండప స్తంభాల మీద ఎలాంటి చెక్కడాలు కనిపించవు. ఆలయం కుడి పక్కన ఉన్న కొండరాతి మీద తమిళ భాషలో చెక్కిన శాసనం కనిపిస్తుంది. ఎడమ పక్కన ఉన్న రాతి మీద గుండ్రంగా ఉన్న ఒక గుర్తు చెక్కి ఉంటుంది. అదేమిటో, దాని అర్థం ఏమిటో తెలియరాలేదు. ప్రశాంత ప్రకృతిలో, దట్టమైన అడవిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఈ ఆలయం మనస్సుకు ఎంతో శాంతిని ప్రసాదిస్తుంది. గర్భాలయంలో స్థానక భంగిమలో పులిచర్మం ధరించి, ధనుర్బాణాలు పట్టుకొని విగ్రహ రూపంలో శ్రీ కన్నప్ప నయనారు దర్శనమిస్తారు. నిత్యపూజలు జరిగే ఈ ఆలయంలో భక్తుల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఈ అరుదైన ఆలయం గురించి సామాన్య భక్తులకు తెలియదు. పౌర్ణమి రోజులలో, కార్తిక మాసంలో కన్నప్ప నయనారు జన్మదిన ఉత్సవాలలో భక్తుల సందడి కనిపిస్తుందని అక్కడి సాధువులు తెలిపారు. గిరివలయం చేసే భక్తులు సందర్శించలేనిది శ్రీ కన్నప్ప నయనారు ఆలయం. రక్షిత అటవీ ప్రదేశంలో ఉండటం వల్ల అనుమతి లేకుండా ఎవరూ లోపలికి వెళ్లలేరు.



**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

సింగిల్ పేజి కథ

**1973లో నా అదృష్టంకొద్దీ మొదటి ఛాన్సులోనే నాకు ప్రభుత్వ రంగ సంస్థలో అసిస్టెంటుగా ఉద్యోగం వచ్చి, హైదరాబాద్‌కు పోస్టింగు వచ్చింది. అదృష్టంకొద్దీ మా బావగారు అక్కడే పని చేస్తూ ఉండటం మూలంగా నేను వారి దయతో వారింట్లో పేయింగ్ గెస్టుగా ఉండిపోయాను.**

# తోకలేని పిట్ట

వియోగి



నాన్నగారు చిత్తూరులో పని చేసేవారు. అన్నయ్య విదేశాల్లో యమ్మెస్సి ఈదుతున్నాడు. చెల్లాయి, అమ్మ, నాన్న చిత్తూరులో ఉంటూ మా యిద్దరి గురించి ఆందోళన పడుతుండేవారు.

కొన్నాళ్లకు అన్నయ్య పీజీ అయిపోయి బయటకు వచ్చాడు. అప్పట్లో ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజి ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు వస్తుండేవి. అందువల్ల సిటీకొచ్చి 1975లో తన పేరు రిజిస్టరు చేసుకొన్నాడు అన్నయ్య. రిజిస్టరు చేసుకుని చిత్తూరులో లాటరీ కొడుతూ ఉన్నాడు ఉద్యోగం.. సద్యోగం లేక.

అన్నయ్య అడ్రసు నా అడ్రసు ఇచ్చి ఉండటం వలన ఒకరోజు ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంచి నుండి కాల్ లెటర్ వచ్చింది. దాని ప్రకారం ఫలానా ఉద్యోగం ఫలానా ఆఫీసులో ఉంది, ఫలానా తేదీన హాజరు కావాలి. సమయం పెద్దగా లేదు.

ఓ నాలుగు రోజులే మధ్యలో గ్యాపు. అందుకని నేను అర్జెంటుగా పోస్టాఫీసుకు వెళ్లి విషయాన్ని తెలియపరుస్తూ వెంటనే బయలుదేరి రమ్మని టెలిగ్రాం యిచ్చాను బాగా ఖర్చు పెట్టి. టెలిగ్రాం అంటే ప్రతి పదానికి యింత అని వసూలు చేస్తారు. ఆ కాలంలో నాబోటివాళ్లు అది భరించడం కష్టం.

టెలిగ్రాంలో పూర్తి వివరాలు తెలుపలేం. కాబట్టి అతి చవుకగా(అణా) కార్డు కొని దానిలోవిషయాలు రాసి, అర్జెంటుగా బయలుదేరి వచ్చి ఇంటర్వ్యూకు హాజరు కమ్మని రాశాను. కానీ వాడు ఉన్నది చిత్తూరులో. నేనున్నది హైదరాబాద్‌లో. మా మధ్య దూరం అయిదారు వందల కిలోమీటర్లు. కార్డు ఎప్పుడు చేరాలి, అతను ఎప్పుడు చూడాలి. అయినా అన్నయ్య వస్తాడన్న నమ్మకం నాకు లేదు.

ఎందుకంటే అంతకు ముందు ప్రభుత్వ గుమాస్తా ఉద్యోగాన్ని వదులుకుని పోయి పెద్ద చదువులు చదివాడు విదేశాల్లో. అటువంటిది మళ్లీ ఈ బోడి గుమాస్తా ఉద్యోగానికి వస్తాడా అని నా అనుమానం!

కాకపోతే అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగానికి గరిష్ఠ వయోపరిమిది 28 సంవత్సరాలుగా ఉండేది. అన్నయ్యకు వయసు అయిపోవస్తున్నది. అందుకని నన్ను తిట్టుకోకూడదని ఉత్తరం రాశాను నిరాశగా. ఆ కాలంలో ఫోను సౌకర్యాలు లేవు.

మూడో రోజు ఉదయం కల్లా అన్నయ్య మా యింటికి వచ్చి నన్ను ఆశ్చర్యానికి గురి చేశాడు.

సంతోషంగా ఆహ్వానించాం. అతని ఇంటర్వ్యూ కార్డు చూపించాను (ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజి నుండి వచ్చింది), రేపు ఇంటర్వ్యూ.

అన్నయ్యకు నా పైన కోపం వచ్చింది.

"అరే ఇంత ముఖ్యమైన సమాచారాన్ని నాకు ముందుగా ఎందుకు తెలుపలేదు?"

"నాకు తెలియకుండానే నీకు తెలియచేశాను" చెప్పాను.

"ఏంటి? ఈ కార్డు ద్వారానా?" అంటూ తోకలేని పిట్టను చీదరగా బయటకు తీసి చూపించాడు.

"ఇది రాకపోతే నా గతేంటి?" అడిగాడు.

"అన్నయ్యా! ఆ రోజే నేను నీకు అర్జెంటు టెలిగ్రాం యిచ్చాను కదా! చూడలేదా?" కొంచెం భయపడుతూ అడిగాను.

"నీ మొహం టెలిగ్రాం! కొంచెం కూడా తెలివిలేదు. కొంచెం కూడా రెస్పాన్సిబిలిటీ లేదు నీకు. పైగా అబద్ధాలు ఒకటి!" కోపగించాడు అన్నయ్య రాము.

"అదేంటి? టెలిగ్రాం యిచ్చానని నాతో చెప్పాడే!" మా బావగారు ఆశ్చర్యపోతూ చెప్పారు.

ఆయన కూడా నన్ను కక్కుర్తి వెధవలా చూశారు.

"టెలిగ్రాం అంటే కాస్ట్లీ అని యిచ్చి ఉండడులే రామూ. కూల్‌డౌన్"

నాకు చాలా బాధ కలిగి, ఏడ్పు వచ్చి, లోపలికి పోయి నా సూటుకేసులోంచి వెతికి, టెలిగ్రాం రసీదు తెచ్చి చూపించాను.

ఇద్దరూ నోరెళ్లబెట్టారు.


ఖరీదైన అర్జెంటు టెలిగ్రాం చేరలేదుగానీ అతి చవుకైన కార్డుముక్క ఎంతో దూరం ప్రయాణించి సకాలంలో చేరింది.

దాన్ని పట్టుకుని అన్నయ వచ్చాడు ఆ రాత్రే బయలుదేరి.


అతనికి ఉద్యోగం వచ్చింది.

ఆ టెలిగ్రాం మటుకు ఎప్పటికీ చేరలేదు.

తోకలేని పిట్ట అన్నయ్యకు కొత్త జీవితం యిచ్చింది. ●



ఇంటింటి సర్వే అంటే.. ఎందరున్నారు... అందరికీ కోవిడ్ వచ్చిందా...?
వ్యాక్సీను వేయించుకోని వారెందరూ...?!
Zakir...

బొప్పి రాదే..?! ఏదైనా లేపనం చేయించుకున్నారా..?!
Zakir...




Zakir...


ఈ వారం 'కార్టూన్స్'



ప్రపంచంలోని అతిపెద్ద ఈ అక్వేరియం జార్జియాలో ఉంది. పదమూడు ఎకరాల్లో విస్తరించి వున్న ఈ అక్వేరియంలో ఎన్నో వింతలు, విశేషాలు చూడొచ్చు. జార్జియాలోనే అతి పెద్ద టూరిస్ట్‌గా మారింది.



